Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 66 మేడ్చల్ మల్కాజ్‌గిరి 29 మార్చి 2023 బుధవారం పేజీలు : 4

### పాక్ సంక్షోభం.. కనిష్ఠ స్థాయికి పడిపోయిన రూపాయి

ఇస్లామాబాద్: తీవ్ర ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు వీలుగా అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి రుణాలు పొందేందుకు పాక్ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. తాజా పాకిస్థాన్ రూపాయి మారకపు రేటుపై నిబంధనను సరళతరం చేసింది. దీంతో డాలరుతో పాక్ రూపాయి మారకపు విలువ 255కి పడిపోయింది. పాక్ చరిత్రలో ఇంత పెద్దమొత్తంలో రూపాయి పతనం కావడం ఇదే తొలిసారి. ఐఎంఎఫ్ సూచన మేరకు పాకిస్థాన్ ద్రవ్యమారకపు రేటుపై నిబంధనలను సడలించింది. దీంతో ఒక్క రోజులోనే పాక్ రూపాయి రూ. 24 మేర క్షీణించినట్లు ట్రిబ్యూన్ వెల్లడించింది. రూపాయిపై పాక్ ప్రభుత్వం నియంత్రణలను సరళీకరించాలని, రూపాయి మారకపు విలువను మార్కెట్ నిర్ణయించేలా చూడాలని ఐఎంఎఫ్ పాకిస్థాన్‌ను కోరింది.

### తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. నేడు స్వామివారి దర్శనం కోసం భక్తులతో కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోయి మరీ వెలుపలికి వచ్చాయి. శ్రీవారి టోకెన్ లేని భక్తుల దర్శనానికి 36 గంటల సమయం పడుతోంది. తిరుమల శ్రీవారిని 58,379 మంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి హుండీ ఆదాయం రూ. 3.73 కోట్లు వచ్చినట్టు తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది. నిన్న శ్రీవారికి 28,950 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

# జమిలికే.... జై కొడతారా!?




## బిజెపికి కలిసి వస్తుందని బలంగా నమ్ముతున్న 'మోడీషా'

లోక్ సభ రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. జమిలి ఎన్నికలే శ్రేయస్కరమని.. దాని వల్ల ఖర్చు తగ్గి ఖజానాకు భారీ ఆదా అవుతుందని తెలిపింది. లోక్ సభలో ఓ ప్రశ్నకు కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. అయితే రాజ్యాంగ సవరణ అన్ని రాజకీయ పార్టీలను ఒకేతాటిపైకి తీసుకురావడం వంటి అంశాలు ముడిపడి ఉన్నాయని తెలిపారు. దేశమంతా ఒకేసారి ఎన్నికలు నిర్వహించి 'జమిలి' పోరుకు వెళ్లాలని కేంద్రం కూడా ప్లాన్ చేసింది..దేశంలో ఒకే ఒక పార్టీ ఉండాలనేది బీజేపీ సిద్ధాంతం. ప్రత్యేకించి అది బీజేపీ కావాలన్నది కమలనాథుల ఉవాచ. మోడీ ఇప్పటికే ఇలా చేయాలని ఫిక్స్ అయ్యాడంట.. బీహార్ లో మోడీ వేవ్ నడిచింది.. సర్వేలు ఎన్డీఏకు వ్యతిరేకంగా వచ్చినప్పటికీ లాస్ట్ లో విజేతగా బీజేపీనే నిలిచింది. ఆ వేవ్ ను దేశమంతా కొనసాగించాలని పట్టుదలగా ఉన్నాడట.. పశ్చిమ బెంగాల్ లో కనుక బీజేపీ గెలిస్తే ఈ జమిలీ ఎన్నికలకు కేంద్రం సిద్ధమైంది.

కానీ ఓటమితో ప్రక్రియ ఆగిపోయింది. 2023లో మళ్లీ జమిలి ఎన్నికలకి వెళ్లి ఫుల్ మెజార్టీ తెచ్చుకొని ఇండియా మొత్తం ఒకే పార్టీని ఉండేలా చేయాలని బీజేపీ ప్రయత్నాలు ప్రారంభించిందట.. ఇక దేశంలో ప్రాంతీయ పార్టీలు లేకుండా చేయాలని బీజేపీ స్కెచ్ గీస్తోంది. ప్రతి బూత్ లో బీజేపీకి గణనీయంగా ఓట్లు రాబట్టుకోవాలని.. ఈరోజు పరిస్థితి ప్రతి గ్రామంలో మోడీ గురించి మాట్లాడుకుంటున్నారు కాబట్టి బూత్ లెవల్ లో బీజేపీని బలోపేతం చేస్తే ప్రతి నియోజకవర్గంలో బీజేపీని గెలిచేలా చేయవచ్చని ఆ పార్టీ ఉవ్విళ్లూరుతోందట.. అందుకే 2023 మార్చి-ఏప్రిల్ లో జమిలి ఎన్నికలకు వెళ్లాలని బీజేపీ చూస్తోందని అంటున్నారు. దేశమంతా ఒకేసారి ఎన్నికలు జరిపితే బీజేపీదే విజయం అని.. ఆ గాలిలో ప్రాంతీయ పార్టీలు కొట్టుకొని పోయి మొత్తం బీజేపీ హవా నడుస్తుందని ప్లాన్ చేస్తున్నారట.. మరి ఈ ప్లాన్లు వర్కవుట్ అవుతాయా? కావా అన్నది వేచిచూడాలి.

## మే నెలాఖరు వరకు బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాలు : మంత్రి కేటీఆర్

హైదరాబాద్ : భారత రాష్ట్ర సమితి పార్టీ విస్తృతంగా చేపడుతున్న ఆత్మీయ సమ్మేళనాలు మే నెలాఖరు వరకు నిర్వహించుకోవచ్చని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు సూచించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఏప్రిల్ 27వ తేదీ నాటికి ఆత్మీయ సమ్మేళనాలను పూర్తి చేసుకోవాలని పార్టీ సూచించిన సంగతి తెలిసిందే. అయితే ప్రస్తుతం జరుగుతున్న ఆత్మీయ సమ్మేళనాల కార్యక్రమాల నేపథ్యంలో పార్టీ అధ్యక్షులు, సీఎం కేసీఆర్ ఆదేశాల



మేరకు మరింత కులంకషంగా, విస్తృతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలని కేటీఆర్ ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను కోరారు. ప్రస్తుతం గడువుని మరింతగా పెంచిన నేపథ్యంలో పార్టీ ఆత్మీయ సమ్మేళనాలు మరింత విస్తారంగా నిర్వహించుకునే వీలు కలుగుతుందని కేటీఆర్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా అధ్యక్షులతో ఈ మేరకు సమన్వయం చేసుకోవాలని పార్టీ నియమించిన జిల్లా ఇంచార్జిలకు మంత్రి కేటీఆర్ ఆదేశించారు.




## ఉండేదెవరు.. పోయేదెవరు..?.. గులాబీ బాస్ ఏం చేయబోతున్నారు?

వరంగల్ : ఓరుగల్లు గులాబీ రాజకీయాలు రక్తి కట్టిస్తున్నాయి. బీఆర్ఎస్ (టీఆర్ఎస్) అధినేత కేసీఆర్ చేసిన ఒకే ఒక్క ప్రకటన ఉమ్మడి జిల్లాలో కాక రేపింది. సిట్టింగ్‌లకే సీట్లని చెప్పడంతో ఆశావహుల్లో గుబులు రేగింది. మరి టిక్కెట్లు ఆశించినవారు ఎదురుతిరిగితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో గులాబీ కోట బీటలు వారుతుందా? ఈ పరిస్థితుల్లో ప్రతిపక్షాలు ఏం చేయబోతున్నాయి?

**రాబోయే కాలానికి కాబోయే లీడర్ :** ఉద్యమాల ఖిల్లా ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాలు రసవత్తరంగా మారబోతున్నాయి. రాబోయే కాలానికి కాబోయే లీడర్ నేనేనంటూ తిరిగిన నాయకులకు దిమ్మ తిరిగేలా షాక్ ఇచ్చారు గులాబీ దళపతి సీఎం కేసీఆర్. వచ్చే ఎన్నికల్లో సిట్టింగ్‌లకే సీట్లని ప్రకటించడంతో ప్రస్తుత ఎమ్మెల్యేలకు కాస్త ఊరటనిచ్చినా, టిక్కెట్లు ఆశిస్తున్నవారిని మాత్రం ఆందోళనకు గురిచేస్తోంది. ఏ ఇద్దరు కలిసిన టిక్కెట్లపైనే చర్చించుకుంటున్నారు.

ఉద్యమ కాలం నుంచి కేసీఆర్ వెన్నంటి ఉండి రాజకీయ సమీకరణాల నేపథ్యంలో పలు మార్లు పోటీకి దూరమైన నేతలను ఆలోచనలో పడేసి ఆందోళనకు గురిచేస్తోందట. అలా టిక్కెట్ రాదని ఖరారు చేసుకున్న నేతలు భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకునే పనిలో నిమగ్నమవుతున్నారట.

**ఆ ఏడింట్లో సెగలే :** ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు ఉండగా అందులో ములుగు మినహా.. మిగిలిన 11 నియోజకవర్గాల్లో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. వీటిలో ఏడు చోట్ల గులాబీ గూటిలోనే పోటీ తప్పని పరిస్థితి ఏర్పడింది. పాలకుర్తి, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, నర్సంపేటలో మాత్రమే సిట్టింగ్‌లకు పోటీ లేదు. మిగతా అన్ని చోట్లా సిట్టింగ్‌లకు పోటీగా ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఉద్యమ కాలం నాటి నాయకులు మేమున్నామంటూ ముందుకు వచ్చే అవకాశాలున్నాయి. పలు చోట్ల కొంతకాలం నుంచి రాజకీయంగా కత్తులు దూసుకునే పరిస్థితులు కొనసాగుతున్నాయి. నాయకుల మధ్య అంతర్గతంగా ఉన్న విబేధాలు అనేకసార్లు బయట కూడా పడ్డాయి. ఎత్తుకు పై ఎత్తులతో టిక్కెట్ సాధించుకునే పనిలో గులాబీ నేతలు ఉండగా సిట్టింగ్‌లకే మళ్లీ అవకాశం ఇస్తామని కేసీఆర్ ప్రకటించడం ఆశావహులకు మింగుడు పడటం లేదు.

**ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్సీ :** స్టేషన్ ఘనపూర్‌లో తాటికొండ రాజయ్య సిట్టింగ్ ఎమ్మెల్యే. ఆయనకు పోటీగా ఎమ్మెల్సీ కడియం శ్రీహరి లేదా ఆయన కూతురు కావ్య టిక్కెట్ ఆశిస్తున్నారు. రాజయ్య, కడియం మధ్య నువ్వా నేనా అన్నట్లుగా రాజకీయాలు నడుస్తున్నాయి. సీఎం నిర్ణయం మళ్లీ ఇద్దరి మధ్య అగ్గికి ఆజ్యం పోసినట్లయిందని స్థానిక నాయకులు భావిస్తున్నారు. వరంగల్ తూర్పులో ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్‌కు పోటీగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర టికెట్ ఆశిస్తున్నారు. భూపాలపల్లిలో కాంగ్రెస్ నుంచి గెలిచి టీఆర్ఎస్‌లో చేరిన గండ్ర వెంకట రమణారెడ్డికి పోటీగా.. మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి టికెట్ రేసులో ఉన్నారు. డోర్నకల్ లో సీనియర్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ స్థానంలో మంత్రి సత్యవతి రాథోడ్ టికెట్ ఆశిస్తున్నారు. మహబూబాబాద్ లో ఎమ్మెల్యేగా శంకర్ నాయక్ ఉండగా అక్కడ ఎంపి కవిత టిక్కెట్ కోరుతున్నారు. ఇప్పటికే పలుమార్లు ఇద్దరి మధ్య విబేధాలు బజారుకెక్కాయి. ఇక పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి పోటీగా.. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ రైతు విమోచన కమిటీ చైర్మెన్ నాగుర్ల వెంకటేశ్వర్లు టిక్కెట్ రేసులో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. జనగాం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి పోటీగా.. ఎమ్మెల్సీ పోచంపల్లితో పాటు మరో నాయకుడు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.

**తెరపైకి ఆపరేషన్ ఆకర్ష్ :** గత అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్‌లకే సీట్లని ప్రకటించిన గులాబీ దళపతి.. కొండ సురేఖకు హ్యాండిచ్చారు. అయితే గతంలో మాదిరిగా ఈ సారి సైతం రెండు మూడు చోట్ల అభ్యర్థులను మార్చే అవకాశం ఉంటుందని పార్టీ నాయకులు భావిస్తున్నారు. అదే నిజమైతే సిట్టింగ్‌లకు సైతం ప్రమాదం పొంచి ఉంది. గత అనుభవం దృష్ట్యా ఆశావహుల్లో ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నాయి. మరోవైపు.. కేసీఆర్ ప్రకటన తర్వాత అసంతృప్త నేతల కోసం కాంగ్రెస్, బీజేపీలు కాచుకుని కూర్చున్నాయి. ఆపరేషన్ ఆకర్ష్‌కు పదును పెట్టి టిక్కెట్ రాదని నిర్ధారించుకున్న వారిని తమ వైపు తిప్పుకునే విధంగా వ్యూహ రచన చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఎన్నికల నాటికి గులాబీ గూటిలో ఉండేదెవరో పోయేదెవరో అంటూ.. కేడర్ చర్చించుకుంటోంది.



# 'కల్వకుంట్ల'పై కేంద్రం కన్నెర్ర

## కేసీఆర్ కుటుంబంపై ముప్పేట దాడి!?

హైదరాబాద్ : ముప్పేట దాడనే పదాన్ని చాలామంది చాలాసార్లు ప్రయోగిస్తుంటారు చాలామంది వింటూనే ఉంటారు. కానీ దాని అసలైన అర్థం ఇపుడు కేసీయార్ కుటుంబాన్ని చూస్తే తెలుస్తుంది. కేసీయార్ కవిత కేటీయార్ ముగ్గరిమీద ఒకేసారి వివిధ రూపాల్లో దాడులు జరుగుతున్నాయి. బహుశా దీన్నే ముప్పేటదాడంటారేమో. ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో విచారణకు ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కవిత వెంటపడింది. టీఎస్పీఎస్సీ నిర్వహించిన ప్రవేశపరీక్షల ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం తాజాగా కేసీయార్ కేటీయార్ కు చుట్టుకుంటోంది. టీఎస్పీఎస్సీ నిర్వహించిన ప్రవేవపరీక్షల ప్రశ్నపత్రం లీకవ్వటంతో చాలా పరీక్షలను ప్రభుత్వం రద్దుచేసింది. ప్రవేశపరీక్షలు ఎప్పుడు నిర్వహించేది తొందరలోనే ప్రకటిస్తానని బోర్డు చెప్పింది. దాంతో గ్రూప్ 1 పరీక్ష రాసిన వేలాదిమందిలో ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఇపుడా విషయం కేసీయార్ కు చుట్టుకోబోతోంది. నిరుద్యోగులు పరీక్షలు రాసినవారంతా టీఎస్పీఎస్సీ ఆఫీసు ముందు గోల మొదలుపెట్టారు. యువకుడి ఆత్మహత్యకు కేసీయార్ నిర్లక్ష్యమే కారణమని ప్రతిపక్షాలు ఆరోపణలు మొదలుపెట్టాయి. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డయితే యువకుడి ఆత్మహత్యకు కారకుడంటు కేసీయార్ మీద హత్యా నేరం కింద కేసు నమోదుచేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే సమయంలో పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం ఫెయిలైనందుకు నైతిక బాధ్యతగా మంత్రి కేటీయార్ రాజీనామా చేయాలనే డిమాండ్ ప్రతిపక్షాల నుండి పెరిగిపోతోంది. ఎందుకంటే ఒక వ్యక్తిచేసిన పనిని ప్రభుత్వానికి ఎలా ఆపాదిస్తారంటు కేటీయార్ మండిపడ్డారు. దానిమీదే ఇపుడు నిరుద్యోగులు పరీక్షలు రాసిన వాళ్ళతో కలిసి ప్రతిపక్షాలు గోల మొదలుపెట్టాయి. అంటే ఏకకాలంలో ఒకవైపు కూతురును ఈడీ వెంటాడుతోంది. ప్రవేశపరీక్షల లీకేజీ వ్యవహారం కేసీయార్ కేటీయార్ కు గట్టిగా తగులుకుంటోంది. ఒకేసారి తండ్రి కొడుకు కూతురు ఇబ్బందుల్లో తగులుకోవటాన్ని ముప్పేటదాడి అని అంటారు. ప్రవేశపరీక్షల ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం రాష్ట్రానికి సంబంధించే కాబట్టి ఏదోలా కేసీయార్ కేటీయార్ బయటపడతారు. కానీ ఈడీ విచారణ నుండి కవిత ఎలా బయటపడగలరు ? అనేది ఆసక్తిగా మారిపోయింది. మొత్తానికి ఒకేసారి యావత్ కుటుంబానికి ఏదోరూపంలో సెగ బాగా తగులుతోందనే చెప్పాలి.

## సంపాదకీయం

### న్యాయం కోసం ఎదురుచూపులు.. పెండింగ్ కేసులు కోట్లల్లో..!

వందమంది దోషులు తప్పించుకున్న పర్లేదు గానీ ఒక్క నిర్దోషికి కూడా శిక్ష పడకూడదు అనే స్లోగన్ పై భారతీయ శిక్షాస్మృతి నడుస్తోంది. అయితే న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించిన బాధితులకు సత్వర న్యాయం చేయకుండా ఏళ్లకు ఏళ్లు పెండింగ్ పెట్టడం కూడా వారిని తిరస్కరించడమేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ చిక్కుముడిని విప్పాల్సిన న్యాయస్థానాలు.. ప్రభుత్వాలు మిన్నకుండిపోతున్నాయనే విమర్శలు కొంతకాలంగా వెల్లువెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 4.90కోట్ల కేసులు పెండింగులో ఉన్నాయని పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కోర్టులు.. ప్రభుత్వాలు అనుసరిస్తున్న నాన్చుడు ధోరణి చూస్తుంటే ఈ కేసులన్నీ పరిష్కారం కావడానికి సుమారు వందేళ్ళైనా పట్టే అవకాశం ఉందనే కామెంట్స్ విన్పిస్తున్నాయి. కొన్ని కేసుల్లో బాధితులకు వెంటనే న్యాయం జరుగుతుండగా మరి కొన్ని కేసులు మాత్రం ఏళ్లకు ఏళ్లు పెండింగులో ఉంటున్నాయి. దీంతో బాధితులు న్యాయం కోసం కళ్లుకాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. కొన్ని కేసులైతే 10 ఏళ్లు.. 15 ఏళ్లు.. 20 ఏళ్లు అంటూ సాగుతుండటం గమనార్హం. ఇటీవల కలకత్తా కోర్టు ఓ పురాతన కేసులో తీర్పును ఇచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో వేసిన పిటిషన్ ను ఇటీవల కోర్టు కేసు కొట్టివేసిన ఘటన అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ కేసులో పిటిషన్ వేసిన బాధితులు ఎవరూ హాజరు కాకపోవడంతో కోర్టు కేసు కొట్టి వేసినట్లు సమాచారం. కాగా పెండింగ్ కేసుల విషయంపై కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు విలేకరుల సమావేశంలో స్పందించారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 4.90 కోట్ల కేసులు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. ఈ కేసుల పరిష్కారానికి న్యాయ వ్యవస్థతో కలిసి ప్రభుత్వం కలిసి పని చేయాలని సూచించారు. అప్పుడే బాధితులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. సుప్రీం కోర్టు ఈ కమిటీ చీఫ్ గా భారత ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ డీ.వై చంద్రచూడ్ పెండింగ్ కేసుల పరిష్కారానికి చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. 4.90 కోట్ల పెండింగ్ కేసులు అనేది పెద్ద సంఖ్య అని తెలిపారు. అంటే న్యాయం కోసం కోట్ల మంది వేచి చూస్తున్నారని వెల్లడించారు. న్యాయం జరుగడం ఆలస్యం అవుతుందంటే వారిని తిరస్కరించడంగానే భావించాల్సి ఉంటుందన్నారు. వీలైనంత వరకు కక్షిదారులకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు.. న్యాయస్థానాలు ఉమ్మడి కార్యాచరణ రూపొందించుకోవడం ద్వారా పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించుకోవచ్చనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు.

ఏది ఏమైనా దేశంలో 4.90కోట్ల పెండింగ్ కేసులంటే మాత్రం న్యాయానికి 'సంకెళ్లు' వేసినట్లే కామెంట్స్ వినిపిస్తున్నాయి.

# ఆసిఫాబాద్ జిల్లాలో గుప్పుమంటున్న గుడుంబా



ఆదిలాబాద్ : జిల్లాలో గుడుంబా గుప్పుమంటోంది. ఆసిఫాబాద్, సిర్పూరు నియోకజవర్గాల్లో ఈ దందాను కొంతమంది యధేచ్ఛగా కొనసాగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గుడంబా రహిత సమాజం కోసం చర్యలు తీసుకుంటున్నప్పటికీ పూర్తిస్థాయిలో సఫలీకృతమవడం లేదు. ఎక్సైజ్ అధికారులు, పోలీసులు తరుచూ దాడులు నిర్వహిస్తున్నప్పటికీ ఈ దందాకు బ్రేక్ పడడం లేదన్న ఆరోపణలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అధికంగాసిర్పూరు నియోజకవర్గంలోని కౌటాల, బెజ్జూరు, పెంచికల్‌పేట, దహెగాం, కాగజ్‌నగర్ మండలాల్లోని పలుప్రాంతాల్లో ఈ దందాను జోరుగా సాగుతోంది. పాత విధానానికి స్వస్తి పలికి ఇప్పుడు కొత్త తరహాలో గుడంబాను తయారీ చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్లు, వివిధ పరికరాలను ఉపయోగించి గుడుంబాను తయారు చేస్తున్నారు. ప్రధానంగా నదీ పరివాహక ప్రాంతాలు, ఎవరికీ అంతుచిక్కకుండా ఉండే పొలాల్లో తయారు చేస్తున్నారు. తయారు చేసిన గుడుంబాను ప్యాక్ చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. తక్కువ ధరకు లభిస్తుండడంతో పేద కూలీలు ఎక్కువగా తాగుతున్నారు. ఎక్సైజ్ అధికారులు తరుచూ సమగ్ర స్థాయిలో నివేదికలు రూపొందించి దాడులు నిర్వహిస్తున్నప్పటికీ కూడా ఈ దందా ఆగడం లేదు. తాజాగా పోలీసులు సైతం గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి నిర్వాహకులపై కేసులు కూడా నమోదు చేశారు. సిర్పూరు నియోజకవర్గంలోని పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సంయు క్తగా దాడులు నిర్వహించి 15కేసులు నమోదు చేశారు. కేసులు నమోదు చేయడమే కాకుండా గుడుంబా అమ్మకాలపై, వాడకంపై గ్రామస్థులను చైతన్య పరుస్తున్నారు. గతేడాది నుంచి ఎక్సైజ్ అధికారులు పూర్తి స్థాయిలో గుడుంబా తయారు చేసే గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ గ్రామాల్లోనే తయారీదారులకు గుడుంబా తయారు చేస్తే జరిగే పరిణామాలపై అవగాహణ కల్పిస్తున్నారు. గుడుంబాకు బదులుగా చిరువ్యాపారం చేసేందుకు రుణాలను ఇప్పిస్తున్నారు. గుడుంబా రహిత సమాజం కోసం అంతా అడుగులు వేస్తున్నారు. ఐతే కొంత మంది మళ్లీ ఇదే దందాను ఎంచుకొని నడిపిస్తున్నారు. గుడుంబా తయారీ చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రధానంగా కిందటేడు లాక్‌డౌన్ ఉండడంతో మద్యం లభించక పోవడంతో గుడుంబా తాగారు. దీంతో ఎక్కడ లేని డిమాండు వచ్చిపడింది. దీన్ని కంట్రోల్ చేసేందుకు ఎక్సైజ్, పోలీసు శాఖలు సమన్వయంగా రంగంలోకి దిగి అక్రమ రవాణాపై నిఘా పెట్టాయి. కౌటాల నుంచి కాగజ్‌నగర్‌కు ఆటోలు, బైక్‌లతో తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. అలాగే కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రాథోడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి సిర్పూరు నియోజకవర్గంలో గుడుంబా తయారీ చేసి వారిపై గట్టి నిఘా పెడుతున్నారు. గుడుంబా తయారీలో ప్రధానంగా ఉపయోగించే బెల్లం, స్పటిక అమ్మకాలపై పోలీసులు, ఎక్సైజ్ అధికారులు నిఘా పెట్టారు. గుడుంబా అమ్మకాలపై గట్టి నిఘా –మహేందర్ సింగ్, ఎక్సైజ్ సీఐ గుడుంబా అమ్మకాలు, స్థావరాలపై గట్టి నిఘా పెడుతున్నాం. ఎట్టి పరిస్థితుల్లో అమ్మకాలు జరపరాదని జనమైత్రీ సదస్సులో గ్రామస్థులకు వివరించాం. గుడంబా వల్ల కలిగే అనర్థాలపై కూడా ర్యాలీలు నిర్వహించాం. ఎవరిని కూడా ఊపేక్షించేది లేదని స్పష్టంగా చెప్పుతున్నాం. గ్రామగ్రామాన అవగాహన పరుస్తున్నాం. ప్రత్యేక టీంల ద్వారా గుడుంబా తయారు చేసే గ్రామాలపై గట్టి నిఘా పెట్టాం.

# హైవే765డీజీ

మెదక్ : మెదక్–ఎల్కతుర్తి జాతీయ రహదారి పనులకు మోక్షం లభించింది. 133.61 కిలోమీటర్ల ఈ రహదారిని రెండు ప్యాకేజీలుగా విభజించిన కేంద్ర ప్రభుత్వం నిర్మాణ పనులకు నిధులు విడుదల చేసింది. మొదటిప్యాకేజీగా మెదక్–సిద్దిపేట వరకు 69.97 కి.మీ. రహదారిని, రెండో ప్యాకేజీలో సిద్దిపేట–ఎల్కతుర్తి వరకు 63.64 కి.మీ. రోడ్డును నిర్మించనున్నారు. మొదటి దశలో సిద్దిపేట–ఎల్కతుర్తి వరకు జాతీయ రహదారి నిర్మాణానికి రూ.578.85 కోట్లను జాతీయ రహదారులశాఖ విడుదల చేసింది. ఐదేళ్ల క్రితమే ఈ రోడ్డుకు జాతీయ హోదా కల్పించినప్పటికీ పనులు ముందుకు సాగలేదు. మెదక్ నుంచి సిద్దిపేట, హుస్నాబాద్ మీదుగా ఎల్కతుర్తి వరకు 134 కి.మీల రోడ్డును జాతీయ రహదారిగా ప్రకటిస్తూ ఎన్‌హెచ్ 765 డీజీ నంబరును కేటాయించారు. మెదక్ నుంచి సిద్దిపేట వరకు మొదటి ప్యాకేజీగా, సిద్దిపేట నుంచి ఎల్కతుర్తి వరకు రెండో ప్యాకేజీగా విభజించారు. తాజాగా సిద్దిపేట నుంచి ఎల్కతుర్తి వరకు రెండో ప్యాకేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే మెదక్–సిద్దిపేట మొదటి ప్యాకేజీకి రూ.882.18 కోట్లు ఖర్చవుతుందని ప్రణాళిక సిద్ధం చేసినా నిధులపై అధికారిక ప్రకటన రాలేదు. కేంద్ర మం త్రి నితిన్‌గడ్కరీ రూ.882.18కోట్ల పనులకు నిధులు మంజూరు తెలిపినట్లు ట్విట్టర్‌లో పేర్కొన్నారు. త్వరలోనే టెండర్లుసిద్దిపేట–ఎల్కతుర్తి మధ్య హైవే విస్తరణ పనులకు 578.85 కోట్లను వెచ్చించనున్నారు. మొదటి దశలో రూ.223 కోట్లు విడుదల చేయనున్నారు. 2022–25లోగా పనులు పూర్తిచేసేలా త్వరలోనే టెండర్లు పిలువనున్నారు. ఇందులో రోడ్డు విస్తరణకు సం బంధించిన భూసేకరణ, పరిహారం, ఇతర ఖర్చులు కూడా భ రించాల్సిన అవసరం ఉన్నది. సిద్దిపేట నుంచి ఎల్కతుర్తి వరకు ప్రస్తుతం డబుల్ రోడ్డు ఉన్నది. నాలుగు లేన్లుగా హైవే నిర్మించే క్రమంలో భూసేకరణ, ఇళ్లు, భూములను కోల్పోతున్న వారికి నష్టపరిహారంపై ఇంకా పూర్తిస్థాయిలో నిర్ణయం తీసుకోలేదు.

రెండు మేజర్.. 29 మైనర్ బ్రిడ్జిలుహైవే నంబర్ 765 డీజీపై కోహెడ మండలం బస్వాపూర్, హుస్నాబాద్ మండలం పందిల్ల వద్ద వాగులపై రెండు భారీ వంతెనలు నిర్మించనున్నారు. ప్రస్తుతం సాధారణ వర్షాలకే వాగులు ఉప్పొంగి ఇక్కడ రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నది. హైవే విస్తరణ నిర్ణయంతో వాహనదారుల కష్టాలు తొలగిపోనున్నాయి. వీటితో పాటు 26 మైనర్ వంతెనలు నిర్మించనున్నారు. 29 కల్వర్టులు, 28 శ్లాబ్ కల్వర్టులు, 2 బాక్సు కల్వర్టులు, 15 చైన్ కల్వర్టులు కూడా నిర్మించాల్సి ఉంటుంది. ఎల్కతుర్తి వద్ద మేజర్ జంక్షన్‌ను నిర్మించి వరంగల్–కరీంనగర్ హైవేకు అనుసంధానం చేయనున్నారు. 28 చోట్ల మైనర్ జంక్షన్లను ఏర్పాటు చేయనున్నారు.

పందిల్ల వద్ద టోల్‌ప్లాజాభారీ వ్యయంతో నిర్మించనున్న జాతీయ రహదారి కోసం వాహనదారుల నుంచి పన్ను వసూలు చేయనున్నారు. సిద్దిపేట జిల్లాలో హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామం వద్ద భారీ టోల్‌ప్లాజాను ఏర్పాటు చేయనున్నారు. సిద్దిపేట జిల్లాలో సిద్దిపేట పట్టణ శివారులోని రంగధాంపల్లి వద్ద హైవే మొదలై మిట్టపల్లి, నంగునూరు మండలం ముంద్రాయి, రాజగోపాల్ పేట, పాలమాకుల, బద్దిపడగ, కోహెడ మండలం బస్వాపూర్, ఆరెపల్లి, సముద్రాల, కోహెడ క్రాస్, హుస్నాబాద్ మండలం పందిల్ల, హుస్నాబాద్, పోతారం,



జిల్లెల్లగడ్డ, హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రాంనగర్, గట్లనర్సింగాపూర్, ముల్కనూరు, కొత్తపల్లి, ఎల్కతుర్తి మండలం ఇందిరానగర్, ఎల్కతుర్తి వరకు విస్తరించి ఉంటుంది.

మెరుగపడనున్న రవాణా సౌకర్యంమెదక్ – ఎల్కతుర్తి జాతీయ రహదారి నిర్మాణం పూర్తయితే మెదక్, సిద్దిపేట జిల్లాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. ప్రస్తుతం ఉన్న డబుల్ రోడ్డును 10 మీటర్ల వెడల్పుతో విస్తరించడంతో ఇరుకైన గతుకుల రహదారిపై ప్రయాణం తప్పనుంది. నాగ్‌పూర్, బోధన్ జాతీయ రహదారుల మధ్య కనెక్టివిటీ పెరుగుతుంది. దూరాభారం తగ్గనుంది. కూరగాయలు, పండ్లు, వ్యవసాయ ఉత్పత్తులను పండించే రైతులకు జాతీయ రహదారి ఎంతగానో ఉపయోగపడనున్నది. మెదక్–సిద్దిపేట మార్గంలో రహదారి ప్రస్తుతం ఏడు మీటర్ల పొడువు ఉండగా ఇరువైపులా మూడు మీటర్ల మేర విస్తరించాల్సి ఉంటుంది. దీంతో భూసేకరణ అవసరం తక్కువగా ఉండవచ్చు. మెదక్ నుంచి రామాయంపేట మార్గంలో కొంత అటవీ భూమిని సేకరించాల్సి ఉంటుంది. మరోవైపు జాతీయ రహదారి విస్తరణ పనులతో మెదక్–సిద్దిపేట మార్గంలో ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపుల ఉన్న భారీ వృక్షాలు కనుమరుగుకానున్నాయి. తొలగనున్న కష్టాలు

–హరీశ్‌రావు, ఆర్థిక, వైద్యఆరోగ్యశాఖ మంత్రి తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో రవాణా వ్యవస్థ మెరుగుపడింది. ప్రస్తుతం సిద్దిపేట నుంచి వరంగల్ మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జాతీయ రహదారి నిర్మాణంతో కష్టాలు తొలగనున్నాయి. ఈ రహదారికి నిధుల మంజూరు కోసం మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితోపాటు పలుమార్లు కేంద్ర మంత్రులను కలిసి విన్నివించాము. రవాణా సౌకర్యం మెరుగు

–రఘునందన్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యేమెదక్–సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణతో రవాణా సౌకర్యం మెరుగవుతుంది. జాతీయ రహదారుల మధ్య కనెక్టివిటీ పెరుగుతుంది. సమయం, డబ్బు ఆదా అవుతాయి. దూరభారం తగ్గుతుంది. రామాయంపేటలో అటవీ భూముల సేకరణ కొంత సమస్యగా ఉన్నా అధిగమిస్తాం. రామాయంపేటకు కొత్త బైపాస్ రోడ్డు నిర్మాణంపై అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ రోడ్డుతో దుబ్బాక నియోజకవర్గానికి మేలు జరుగుతుంది.

# గుట్టుగా.. రేషన్ బియ్యం రవాణా

మెదక్ : ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నది. అక్రమ దందాను వ్యాపారంగా మార్చుకున్న కొందరు.. ముఠాగా ఏర్పడి రాత్రివేళల్లో లారీల్లో రహస్యంగా పొరుగురాష్ట్రాలకు తరలిస్తున్నారు. పోలీసుల సహకారంతో అడపాదడపా తనిఖీలు నిర్వహించే పౌరసరఫరాలశాఖ అధికారులు గతేడాదిలోనే రూ.1.42 కోట్ల విలువైన 11,422.57 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు. పౌరసరఫరాలశాఖ అధికారుల తనిఖీల్లో పట్టుబడిన బియ్యం ఈ స్థాయిలో ఉంటే పట్టుబడకుండా అక్రమ రవాణా జరిగే బియ్యం విలువ పదిరెట్లు ఎక్కువ ఉంటుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యా న్ని వాడుకోని ప్రజలు కిలో రూ.10చొప్పున అమ్ముకుంటున్నారు. ఇలా రేషన్ అమ్ముకునే వారి సంఖ్య ఎక్కువగా సంగారెడ్డి, రంగారెడ్డి, యాదాద్రి, హైదరాబాద్ జిల్లాలోనే ఉన్నట్లు అక్రమార్కులు గుర్తించి వారంతా ఓ ముఠాగా ఏర్పడ్డారు. ప్రభుత్వం నుంచి బియ్యం సరఫరా కాగానే కొనుగోళ్లు చేపడుతున్నారు. ఆయా జిల్లాల్లోని రేషన్ డీలర్లు సహకరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

ఓఆర్ఆర్ మీదుగా తరలింపుఆయా జిల్లాల్లో రేషన్ బియ్యాన్ని ప్రతినెలా వేల క్వింటాళ్లలో కొనుగోలు చేస్తున్న ముఠా ఔటర్ రింగ్‌రోడ్డు మీదుగా సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్ మీదుగా లారీల్లో తరలిస్తున్నారు. జహీరాబాద్ శివారులోని చిరాగ్‌పల్లి, మార్డిలలో చెక్‌పోస్టులున్నా అక్కడి సిబ్బందిని ప్రలోభాలకు గురి చేసి, అక్రమ రవాణాకు మార్గం సుగమం చేసుకుంటున్నట్టు తెలిసింది. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్‌కు ఎక్కువ సంఖ్యలో రేషన్ బియ్యాన్ని రవాణా చేస్తున్నట్లు సమాచారం.

రూ.10కు కొనుగోలు... రూ.32కు అమ్మకంబియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్న ముఠా సభ్యులు సంగారెడ్డి, రంగారెడ్డి, యాదాద్రి, హైదరాబాద్ జిల్లాల్లో కిలో రూ.10 చొప్పున రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నారు. ప్రతినెలా వేల క్వింటాళ్లలో కొనుగోలు చేస్తున్న బియ్యాన్ని లారీల్లో కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్‌కు తరలిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఈ బియ్యాన్ని కిలో రూ.32 చొప్పున అమ్ముతున్నట్టు తెలిసింది. ఆయా రాష్ట్రాల్లో ఈ బియ్యంతో కుర్‌కురేలు, రవ్వ లడ్డూలు, తదితర తినుబండారాలు తయారుచేసి విక్రయిస్తునట్లు సమాచారం. తనిఖీల్లో పట్టుబడ్డ బియ్యం పోలీసుల సహకారంతో పౌరసరఫరాల శాఖ అధికారులు అడపాదడపా తనిఖీలు నిర్వహిస్తుంటారు. ఆ రకంగా గతేడాది జనవరి నుంచి ఇప్పటి వరకు ఔటర్‌రింగ్ రోడ్డు సమీపంలోని ముత్తంగి, సదాశివపేట, కంకోలు, జహీరాబాద్‌తో పాటు చెక్‌పోస్టులున్న చిరాగ్‌పల్లి, మార్డిల వద్ద నిర్వహించిన తనిఖీల్లో 11,422.57 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్ చేశారు. ఈ బియ్యం విలువ రూ.1,42,49,704.00 ఉంటుందని పౌరసరఫరాల అధికారవర్గాలు తెలిపాయి. లారీలను సీజ్ చేసి, డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. గతేడాది నుంచి ఇప్పటి వరకు 90 మందిపై కేసులు నమోదయ్యాయి.

డ్రైవర్లపై కేసులు ?

పొరుగు రాష్ట్రాలకు లారీల్లో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ముఠా ఎక్కడా దొరక్కకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నది. బియ్యం లారీలకు అరకిలోమీటర్ ముందు ఈ ముఠా సభ్యులు కార్లలో ప్రయాణిస్తుంటారు. పోలీసులు, అధికారుల తనిఖీల్లో పట్టుబడ్డా తమ పేర్లు చెప్పకూడదని లారీల యజమానులతో, డ్రైవర్లతో ముఠా సభ్యులు ఒప్పందం కుదుర్చుకుంటున్నారని తెలిసింది. ఇందుకు అవసరమైన మేర డబ్బును ముఠా సభ్యులు లారీల యాజమానులకు, డ్రైవర్లకు ఇస్తున్నారని సమాచారం. అందువల్లే పోలీసులు, అధికారుల తనిఖీలలో పట్టుబడ్డప్పుడు సైతం డ్రైవర్లు ముఠా సభ్యుల పేర్లు చెప్పడం లేదని పౌరసరఫరాల అధికారవర్గాలు తెలిపాయి. ఈ కారణంగానే లారీలను సీజ్ చేసి, డ్రైవర్లపై కేసులు నమోదు చేసి కోర్టుకు నివేదిస్తున్నామని ఆ వర్గాలు తెలిపాయి. ఏమైనా ప్రజల అవసరాల కోసం ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యం వేల క్వింటాళ్లలో ప్రతి నెలా పక్కదారి పట్టిస్తున్న ముఠా ఆగడాలను ఎలా అరికడతారో చూడాల్సిందే?

272 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

జహీరాబాద్ జనవరి 10: జహీరాబాద్ మండలం మొగుడంపల్లి మండల మడిగి శివారులోని ఆర్టీవో చెక్‌పోస్ట్ వద్ద అక్రమంగా జహీరాబాద్ నుంచి గుజరాత్‌కు తరలిస్తున్న 272క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు చిరాగ్‌పల్లి ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. జహీరాబాద్ డీఎస్పీ శంకర్‌రాజు ఆదేశానుసారం బుధవారం పోలీస్ సిబ్బందితో మడిగి చెక్‌పోస్ట్ వద్ద 65వ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. జహీరాబాద్ నుంచి కర్ణాటక వైపు వస్తున్న లారీని తనిఖీ చేయగా 690 బ్యాగుల్లో 272 క్వింటాళ్ల రేషన్ బియాన్ని స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్ చలానా ధీరుభాయ్, అతని యజమాని అశోక్ మోరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# ఏడాదిగా ఎదురుచూపులు

మెదక్ : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి అన్నదాతలకు మద్దతు ధర దక్కేలా చూస్తున్న నిర్వాహకులకు ఏడాదిగా కమీషన్ డబ్బు అందడం లేదు. ఫలితంగా వారికి ఏడాదిగా ఎదురుచూపులు తప్పడం లేదు. అటు రైతులకు, ఇటు సర్కారుకు అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తూ ధాన్యం కొనుగోలును సమర్థవంతంగా చేపడుతున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్), ఐకేపీ స్వయం సహాయక సంఘాల శ్రమకు ఫలితం దక్కడం లేదు.

జిల్లాలో గతేడాది బకాయిలు రూ.8.66 కోట్లు సంగారెడ్డి జిల్లాలో 2020–21 ఖరీఫ్, రబీ సీజన్‌కు సంబంధించి పీఏసీఎస్‌లు, స్వయంసహాయక సంఘాలకు సర్కారు నుంచి కమీషన్ల రూపంలో రూ.8.66 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఇందులో 2020–21 ఖరీఫలో కొనుగోలు కేంద్రాల ద్వారా 87,475 మెట్రిక్ టన్నుల వరిని సేకరించారు. కమీషన్ రూపంలో రూ.2,79,92,000 ప్రభుత్వం పీఏసీఎసలకు, ఐకేపీ సంఘాలకు చెల్లించాల్సి ఉంది. 2020–21 రబీ సీజన్‌కు సంబంధించి కొనుగోలు కేంద్రాల ద్వారా 1,83,229 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన పీఏసీఎసకు, ఐకేపీ సంఘాలకు కమీషన్ రూపంలో ప్రభుత్వం రూ.5,86,33,280 చెల్లించాల్సి ఉన్నది. 2020–21 సంవత్సరం గడిచి ఏడాది కావస్తున్నా ఆ సంవత్సరంలో ఖరీఫ్, రబీ సీజన్లలో కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి కమీషన్ రూపంలో ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.8,66,25,280 చెల్లించకపోవడంతో పీఏసీఎసలు, ఐకేపీ సంఘాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

గత ఖరీఫ్ సీజన్ బకాయిలు రూ.5 కోట్లు (2021–22) ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలోని ఆయా సంఘాలు 1,56,300 మెట్రిక్ టన్నుల వరిధాన్యాన్ని కొనుగోలు చేశాయి. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఆయా సంఘాలకు రూ.5,00,16,000ను చెల్లించాలి. కమీషన్ రూపంలో ఐకేపీ సంఘాలకు, పీఏసీఎస్‌లకు కమిషన్ రూపంలో చెల్లించాల్సిన డబ్బు కోసం జిల్లా యంత్రాంగం లేఖలు రాస్తున్నా ప్రభుత్వం నుంచి సరైన సమాధానం రావడం లేదని తెలిసింది. మెట్రిక్ టన్నుకు రూ.320 చొప్పున కమీషన్‌రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి మెట్రిక్ టన్నుకు రూ.320 చొప్పున కమీషన్ రూపంలో ప్రభుత్వం పీఏసీఎస్‌లకు, ఐకేపీ సంఘాలకు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం ఎప్పటికప్పుడు కమిషన్ డబ్బును చెల్లిస్తే ఆయా సంఘాల ఆదాయం పొంది ఇతరత్రా నిర్వహించే వీలుంటుందని పీఏసీఎస్ వర్గాలు పేర్కొంటున్నాయి.

# బడులకు తప్పనున్న విద్యుత్తు బిల్లుల భారం

జనగామ : జిల్లాలోని 23 పాఠశాలలకు సౌర విద్యుత్తు సదుపాయం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతానికి పది బడుల్లో అమర్చనున్నారు. నెట్ మీటర్లు అమర్చడమే తరువాయి అని రెడ్కో అధికారులు చెబుతున్నారు. ప్రతి పాఠశాలలో రెండు కిలోవాట్స్ విద్యుత్తు అందించే సౌర విద్యుత్తు ఉత్పత్తి పరికరాలను అమరిస్తే.. పాఠశాల అవసరాలకు పోగా మిగతా విద్యుత్తును గ్రిడ్‌కు అమ్ముకోవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రధానోపాధ్యాయుల ఆవేదన..

నిత్యం మధ్యాహ్న భోజనం, ఏడాదికో సారి రెండు జతల దుస్తులు, ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ వివరాలు నెలవారీగా సమర్పించే వివిధ రకాల సమాచారాన్ని ప్రధానోపాధ్యాయులు తమ చరవాణి ద్వారా లేదా పాఠశాలల్లోని కంప్యూటర్ల ద్వారా ఉన్నతాధికారులకు అందిస్తున్నారు. డిజిటల్ తరగతుల నిర్వహణతో కూడా విద్యుత్తు వినియోగం పెరిగి నెలకు కనీసం రూ.2,000 విద్యుత్తు బిల్లు చెల్లించాల్సి వస్తోందని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. ఈ బిల్లులను ప్రభుత్వమే భరిస్తే లేదా రద్దు చేస్తే.. మిగులు సొమ్మును పాఠశాలలో భౌతిక వసతుల కల్పనకు వెచ్చిస్తామని చాలా కాలం నుంచి ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు.

స్పందించిన ప్రభుత్వం..

విద్యుత్తు బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు.. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన ఉన్నతపాఠశాలల్లో సౌర విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. జిల్లాలోని 23 ఉన్నతపాఠశాలల్లో వీటిని అమర్చాలని రెడ్కోకు సూచించింది. ఒకే సారి



అన్ని బడుల్లో అమర్చడం సాధ్యం కాదని.. ఈ సంవత్సరం 33 శాతం బడుల్లో అమర్చడానికి రెడ్కో ముందుకొచ్చింది. ఇందులో భాగంగా పది పాఠశాలల్లో వీటి అమరిక పూర్తయింది.

ప్రయోజనమిది..

ఎంపిక చేసిన పాఠశాలల్లో రెండు కిలోవాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసే సౌర పరికరాలను అమర్చారు. పాఠశాల అవసరాలకు రోజుకు రెండు యూనిట్ల విద్యుత్తు వాడుకున్నా మిగులు విద్యుత్తును గ్రిడ్‌కు అమ్ముకోవచ్చు. ఇది పాఠశాలలకు ఆర్థిక ప్రయోజనం. ఎలాంటి విద్యుత్తు బిల్లులు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఇందుకయ్యే రూ.లక్షను ప్రభుత్వం అందిస్తుంది. నెట్ మీటర్లు అమర్చాల్సిన బడులివి.. శివునిపల్లి, మల్కాపూర్, ఖిలాషాపూర్, ధర్మకంచ, పాలకుర్తి, ఇప్పగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలు, జనగామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సౌర ఫలకాల అమరిక పూర్తయి నెట్ మీటర్ల బిగింపునకు సిద్ధంగా ఉన్నాయి. మరో రెండు పాఠశాలల్లో పనులు పురోభివృద్ధిలో ఉన్నాయి.

ప్రతినెలా రూ.2 వేల ఆదా

– మహేందర్‌రెడ్డి, రెడ్కో ఉమ్మడి జిల్లా మేనేజర్, వరంగల్

సౌర విద్యుత్తు సేవల వినియోగంతో ఆరోగ్యకరమైన విద్యుత్తు అందుతుంది. పాఠశాల అవసరాలకు వాడుకోగా మిగిలిన విద్యుత్తును గ్రిడ్‌కు అమ్ముకోవచ్చు. ప్రతి పాఠశాలకు నెలకు కనీసం రెండు వేల రూపాయలు ఆదా అవుతాయి. విద్యుత్తు అవసరాల డిమాండును బట్టి ఉచితంగా సౌర సేవలను వినియోగించుకోవచ్చు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా మిగతా పాఠశాలల్లో ప్లాంట్లను బిగిస్తాం.

# మహిళలకు వడ్డీ లేని రుణాలు

మహబూబాబాద్ : మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యుల నాలుగేళ్ల నిరీక్షణ ఫలించింది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యులకు వడ్డీలేని రుణాలు (వీఎల్ఆర్) అందిస్తామన్న ప్రభుత్వం హామీ నెరవేర్చింది. పురపాలక సంఘాల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, గ్రామీణ ప్రాంతాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా సంఘాల సభ్యులు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించిన వారికి ప్రభుత్వం వడ్డీ రాయితీ ప్రకటించింది. ఆయా సంఘాలకు తామే వడ్డీని చెల్లిస్తామన్న ప్రభుత్వం నాలుగేళ్ల నుంచి వడ్డీని చెల్లించకపోవడంతో సభ్యులు వారు తీసుకున్న రుణాల కిస్తీలతో పాటు వడ్డీని చెల్లిస్తూ వచ్చారు. 2018–19 ఆర్థిక సంవత్సరం వరకు కొన్ని సంఘాలకు గతంలో ప్రభుత్వం చెల్లించింది. మిగిలిన



వారికి కూడా వడ్డీ రాయితీని ఇవ్వాలంటూ వచ్చిన ప్రతిపాదనలతో ప్రభుత్వం ఇటీవల జిల్లాలోని 25,733 సంఘాలకు 2018–19, 2019–20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 19.92 కోట్లు వడ్డీ రాయితీని విడుదల చేసింది. దీంతో మహిళా సభ్యుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు 90 శాతం మహిళా సంఘాల ఖాతాల్లో వడ్డీ రాయితీ జమ కావడంతో నేటి వరకు వారు బ్యాంకులకు చెల్లించిన వడ్డీ తిరిగి లభించడం మహిళలకు ఊరటనిస్తోంది.

# అన్నదాత ఆశలపై వడగళ్లు



కరీంనగర్ : జిల్లాలో గత నాలుగు రోజుల కిందట కురిసిన వడగళ్ల వానతో పంటలకు భారీ నష్టం వాటిల్లింది. జిల్లా వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా రూపొందించింది. వారి లెక్క ప్రకారం జిల్లాలో 23,116 ఎకరాల్లో పంటలు నష్టపోయినట్లు గుర్తించారు. నాట్లు ముందుగా వేసిన రైతుల వరి పంట పొట్ట దశలో ఉండగా వడగళ్లతో దెబ్బతింది. అనుకున్న దిగుబడి రాకపోగా.. వచ్చిన ధాన్యం కాస్త తాలు వచ్చే అవకాశమే ఎక్కువగా ఉంటుంది. మామిడి పంటను చూసి మురిసిపోయిన రైతన్న నెత్తిన పిడుగుపడింది. మొక్కజొన్న, మిరప, పుచ్చ, కర్బూజ, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది.

యాసంగి సాగు ఇలా..

జిల్లాలో ఈసారి గతం కన్నా ఎక్కువగా 2,46,893 ఎకరాల్లో వరి వేశారు. తర్వాత స్థానంలో 23,514 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. తర్వాత స్థానాల్లో 3,454 ఎకరాల్లో వేరుసెనగ, 928 ఎకరాల్లో పొద్దు తిరుగుడు, 542 ఎకరాల్లో పెసర, 403 ఎకరాల శనగ తదితర పంటలతోపాటు మరో పది వేల ఎకరాల ఉద్యానవన పంటలు కలిపి 2,87,731 ఎకరాల్లో పంట సాగు చేశారు.

12 మండలాల్లో..

గంగాధర, రామడుగు, మానకొండూర్, తిమ్మాపూర్, శంకరపట్నం, చిగురుమామిడి, గన్నేరువరం, హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక, సైదాపూర్ మండలాల్లో ఎక్కువగా పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు గుర్తించారు. వరి 13,377, మొక్కజొన్న 7,888, మామిడి 1,619, పుచ్చకాయ 120, వివిధ రకాల కూరగాయల సాగు మరో 112 ఎకరాలు కలిపి 23,116 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు జిల్లా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

త్వరలోనే కొలిక్కి వచ్చే అవకాశం

జిల్లాలో పలుచోట్ల దెబ్బతిన్న పంటలను స్వయంగా పరిశీలించిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఉదారంగా ఆదుకుంటామన్న హామీతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రతి ఎకరాకు నష్ట పరిహారం అందేలా పకడ్బందీగా క్షేత్రస్థాయి పరిశీలన చేసి, నివేదిక తయారు చేయాల్సిన బాధ్యత సంబంధిత శాఖ అధికారులపై ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి విధివిధానాలు రాగానే క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా పంట నష్టం అంచనా వేయడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంది. వ్యవసాయ శాఖ నుంచి ఒకరు, రెవెన్యూ నుంచి ఒకరితోపాటు స్థానిక వ్యవసాయదారుతో కూడిన కమిటీ పంట నష్టాన్ని స్వయంగా పరిశీలించి అంచనా వేయనున్నట్లు సమాచారం.

పండిన వరి పంట నేలపాలు

గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన గుజ్జుల మునీందర్‌రెడ్డి యాసంగి ఆరంభంలోనే ఆరెకరాల్లో వరి పంట సాగు చేశారు. ఎకరాకు రూ.20 వేల చొప్పున పెట్టుబడులు వెచ్చించి నాలుగుసార్లు క్రిమిసంహారక మందులు పిచికారీ చేశారు. వడగళ్లవానతో గింజలు రాలిపోగా, పంటంతా నేలవాలిపోయింది.

ఆరుగాలం శ్రమ ఆవిరైంది

కురిక్యాలకు చెందిన జాగిరపు నరసింహారెడ్డి అయిదెకరాల్లో మిరప పంట సాగు చేసి ఎకరాకు రూ.లక్ష చొప్పున పెట్టుబడులు వెచ్చించారు. మందులు పిచికారీ చేసి కంటికి రెప్పలా కాపాడుకున్నారు. పెట్టుబడులు పోనూ లాభాలు వస్తాయని ఆశించగా, వడగళ్ల వాన విరుచుకుపడింది. తోట పూర్తిగా దెబ్బతింది. మూడున్నరెకరాల్లో కీరదోస, మూడెకరాల్లో టమాట తోటలు దెబ్బతిన్నాయి.

రాలిన మామిడికాయలతో నష్టం

చొప్పదండి మండలం భూపాలపట్నానికి చెందిన చిరంజీవి అనే రైతు రూ.14 లక్షలు వెచ్చించి చిట్యాలపల్లిలో 16 ఎకరాల్లో మామిడి తోటలు కౌలుకు తీసుకున్నారు. వడగళ్ల వానకు కాయలన్నీ నేలరాలి తీవ్ర నష్టం వాటిల్లింది. పెట్టుబడులు రాకుండా అప్పులపాలవుతామని ఆవేదన చెందుతున్నారు.

కాయలన్నీ పగిలిపోయాయి

చొప్పదండి మండలం కల్లెం జగన్మోహన్‌రెడ్డి అనే రైతు నాలుగున్నరెకరాల్లో పుచ్చతోట సాగు చేశారు. రూ.3 లక్షలు పెట్టుబడులు వెచ్చించగా వేసవిలో మంచి డిమాండు ఉండే ఈ ఫలంతో ఆదాయం సృష్టించుకోవచ్చని ఆశించారు. వడగళ్ల ధాటికి కాయలు పగిలి పనికిరాకుండా పోయాయి. నాలుగెకరాల్లో వరి, మొక్కజొన్న పంటలు కూడా దెబ్బతిన్నాయి.

విధి విధానాలు రాగానే నివేదిక తయారు

పంట దెబ్బ తిన్న రైతులకు ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారం అందిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి విధివిధానాలు రాగానే పంట నష్టంపై నివేదిక తయారు చేసి, నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతాం. వాసిరెడ్డి శ్రీధర్, జిల్లా వ్యవసాయాధికారి

# పారిశుద్ధ్యం మెరుగు పడేనా!



కరీంనగర్ : ధర్మపురి మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సేవలు కొంత మెరుగైనా సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పురపాలికలో మొత్తం 15 వార్డులకు ఏడు చెత్తసేకరణ వాహనాలు మాత్రమే ఉన్నాయి. ప్రతిరోజు రెండు వార్డులకు ఒక వాహనం చొప్పున కేటాయిస్తున్నారు. దీంతో కార్మికులకు ఒత్తిడి పెరుగుతోంది. ప్రస్తుతం ఉన్న ఏడు వాహనాలకు అదనంగా మరో ఎనిమిది వాహనాలను కొనుగోలు చేయాలని స్థానికులు కోరుతున్నారు. మున్సిపాలిటీలో 40 మంది కార్మికులు ఉండగా, పెరిగిన పట్టణ పరిధి దృష్ట్యా మరో 40 మంది కార్మికులను నూతనంగా తీసుకోవాల్సిన పరిస్థితులున్నాయి. నదీ తీరంలో పారిశుద్ధ్యానికి ప్రతిరోజు ఒక ట్రాక్టర్‌తో పాటు పూర్తి స్థాయిలో నలుగురు కార్మికులు పని చేస్తున్నారు. స్థానికంగా పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు వీరు సరిపోవడం లేదు. వేసవి దృష్ట్యా నీటి మట్టం తగ్గుతోంది. దీంతో బురద పేరుకుంటుంది. ఈ నేపథ్యంలో మరింత మెరుగ్గా పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సిన ఉంది. పది మంది కార్మికులు ఉంటే పూర్తి స్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపట్టే వీలుంటుంది. ఉత్సవాల సమయంలో మాత్రమే ప్రత్యేకంగా అదనంగా కార్మికులను నియమిస్తున్నారు. డంపింగ్‌యార్డును ఏర్పాటు చేయకపోవడంతో దూరంలో సేకరించిన చెత్తను బ్రాహ్మణసంఘం భవనం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో పడేస్తున్నారు. ప్రత్యేకంగా డంపింగ్‌యార్డును ఏర్పాటు చేసి ఇబ్బందులు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

చాలాచోట్ల అపరిశుభ్రం

స్వామి, భక్తుడు

ధర్మపురి గోదావరి నదీ తీరంలో పారిశుద్ధ్యాన్ని మరింతగా మెరుగు పరచాలి. ప్రస్తుతం చాలాచోట్ల అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ప్రతిరోజు శుభ్రం చేసేందుకు అదనంగా కార్మికులను నియమించాలి. ప్రత్యేక వాహనాలను ఇక్కడ నిలిపేలా చర్యలు తీసుకోవాలి. నదీ తీరంలో ఇష్టారీతిగా చెత్తను వేయకుండా బోర్డులను ఏర్పాటు చేయాలి.

ప్రతిపాదనలు పంపిస్తాం– సీహెచ్ రమేష్, పుర కమిషనర్

ధర్మపురి పురపాలికలో పారిశుద్ధ్య కార్మికుల నియామకాలు పెంచేలా ప్రతిపాదిస్తాం. ప్రతీరోజు వేకువ జామునుంచే పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. గోదావరి తీరం, దేవస్థానం, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. నదీతీరంలో ఇప్పటికే పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేపడుతున్నాం. డంపింగ్‌యార్డు ఏర్పాటుకు స్థల సేకరణకు కృషి చేస్తున్నాం. పురపాలక కౌన్సిల్‌లో ఈవిషయమై చర్చించి వాహనాలను కొనుగోలు చేసేందుకు చర్యలు చేపడతాం.

# వైద్య సేవలకు గుర్తింపు

సిరిసిల్ల : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుంది. జాతీయ నాణ్యతా ప్రమాణాలను పాటించడంతో ఇటీవలే కోనరావుపేట పీహెచ్‌సీకి ఎన్‌క్వాస్ గుర్తింపు రాగా తాజాగా సిరిసిల్ల పట్టణ పరిధిలోని పీఎస్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్ట్స్ (ఎన్‌క్వాస్)కు ఎంపికైంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఎన్‌క్వాస్‌కు ఎంపికయ్యే విధంగా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి సుమన్‌మోహన్‌రావులు ఎప్పటికప్పుడు ఆరోగ్య కేంద్రాలను పరిశీలిస్తూ వైద్యులు, సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. వారి సలహాలు, సూచనలు పాటిస్తూ సిబ్బంది జాతీయ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఆసుపత్రికి వచ్చిన రోగులు, గర్భిణులు, చిన్నారులకు వైద్య సేవలు అందించేందుకు కృషి చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులను పూర్తి ఆరోగ్యవంతులుగా చేశారు. దవాఖానా వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూశారు. పారిశుద్ధ్యంపై శ్రద్ధ తీసుకుంటున్నారు. పచ్చదనాన్ని పటిష్ఠంగా నిర్వహిస్తున్నారు. రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలకు సంబంధించిన చార్టులను ఆసుపత్రి గోడలపై ప్రదర్శించారు. కేంద్ర బృందం పరిశీలన.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర బృంద సభ్యులు మొదటగా పరిశీలిస్తారు. ప్రధానంగా ఆరోగ్య కేంద్రంలో ఓపీ, ఇన్‌పేషెంట్, జనరల్ వార్డు, లేబర్ వార్డు, డెలివరీ రూం, ఫార్మసి అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. ఆసుపత్రిలో అందిస్తున్న సేవల గురించి తెలుసుకుంటారు. వారు నిర్వహించిన సర్వేలో పీఎస్ నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 86.6 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. సంతోషంగా ఉంది– ప్రియాంక, వైద్యురాలు, పట్టణ ఆరోగ్య కేంద్రం, పీఎస్ నగర్

నేను ఇక్కడికి వచ్చి మూడు నెలలు అవుతుంది. ఇక్కడ రోగులకు అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ఈ ఆసుపత్రికి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం సంతోషంగా ఉంది. ఇదే స్ఫూర్తితో రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సమష్టిగా కృషి చేస్తాం.

జిల్లాలో నాలుగు కేంద్రాలు సిద్ధం చేశాం– సుమన్‌మోహన్‌రావు, జిల్లా వైద్యాధికారి జాతీయ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా జిల్లాలో పీఎస్ నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కోనరావుపేట, తంగళ్లపల్లి, కొదురుపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సిద్ధం చేశాం. అందులో ఇప్పటికే కోనరావుపేట, పీఎస్ నగర్ ఆరోగ్య కేంద్రాలకు గుర్తింపు వచ్చింది. మిగతా రెండింటికి కూడా త్వరలో గుర్తింపు వచ్చే అవకాశం ఉంది.

# చెరువెళ్లిపోతోంది..!

సూర్యాపేట : భూముల ధరలకు రెక్కలు రావడంతో.. పట్టణాల్లోని చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయి. ఆక్రమణదారులు యథేచ్ఛగా స్థిరాస్తి వ్యాపారంతోపాటు ఇళ్ల నిర్మాణాలు చేపట్టి విక్రయాలు సాగిస్తున్నారు. జిల్లా కేంద్రాలతో పాటు ప్రధాన పట్టణాల్లో ఇప్పటికే సగానికిపైగా చెరువులు, కుంటలు అన్యాక్రాంతమయ్యాయి. గజం భూమి రూ.వేలల్లో ధర పలకడంతో అధికారులు, ప్రజాప్రతినిధుల అండతో ఆక్రమణలకు తెరలేపుతున్నారు. వీటిని పరిరక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో పట్టణాల్లో చెరువులు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతోంది.

ఇదీ పరిస్థితి

భువనగిరిలో మూడు చెరువులు, ఓ కుంట ఉన్నాయి. పెద్ద చెరువు పట్టణానికి దగ్గరగా ఉండటంతో ఆక్రమణదారులు కన్నేసి సగానికిపైగా ఆక్రమించారు. యాదగిరిగుట్ట పట్టణంలో 4 చెరువులు ఉన్నాయి. నల్లచెరువు పరిధిలో గతంలో ఆక్రమించి వెంచర్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికారులు నేటికీ ధ్రువీకరించడం లేదు. దేవరకొండ పట్టణంలో ఐదెకరాల్లో తుల్చమ్మకుంట ఉంది. గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో వెంచర్ చేశారు. కుంట పరిధిలో కొంతమంది నిర్మాణాలు చేపడుతుండగా ముగ్గురిపై కేసు నమోదైంది. వీటికితోడు



పంట కాల్వలు అన్యాక్రాంతమవుతున్నాయి. మిర్యాలగూడలో పెద్ద చెరువు ఆక్రమణకు గురైంది. చండూరులో 3 చెరువులు ఉన్నాయి. కొంతమేర రైతులు కబ్జా చేశారు. నేరేడుచర్లలో చెరువు, కుంటలు ఉన్నాయి. ఈ రెండింట్లో కొంత మంది రైతులు ఆక్రమించి సాగు చేస్తున్నారు. హుజూర్‌నగర్ పట్టణంలో రైతులు చెరువును ఆక్రమించి సాగు చేస్తున్నారు. తిరుమలగిరిలో 5 చెరువులు ఉన్నాయి. ఎర్రగుంట చెరువు ఆక్రమణకు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. సూర్యాపేటలో 4 చెరువులు ఉన్నాయి. వీటిలో సద్దుల చెరువు, నల్లచెరువు ఆక్రమణకు గురయ్యాయి. సద్దుల చెరువులో ఆక్రమించి నిర్మాణాలు కూడా చేపట్టారు. నల్లచెరువులో తూముల భూములను ఆక్రమించి వరి సాగు చేపడుతున్నారు. కోదాడలో పెద్ద చెరువు పట్టణానికి సమీపంలో ఉండటంతో ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారుల కళ్లముందే ఆక్రమణల పర్వం జరుగుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది.

నామమాత్రంగా కమిటీలు

జిల్లాలో చెరువుల రక్షణకు కమిటీ వేసి కాపాడాలని గతంలో హైకోర్టు పేర్కొంది. ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించింది. అయినా నామమాత్రంగానే చర్యలు ఉన్నాయి. పట్టణాల్లో ఆక్రమణకు గురైన చెరువులు, కుంటలను ఇప్పటికీ ఈ కమిటీలు పూర్తిస్థాయిలో గుర్తించలేదు. కొన్నిచోట్ల గుర్తించినా ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో వాటిని తొలగించలేదు.

# వేగంగా పనులు.. నిలిచిన బిల్లులు

నల్గొండ : గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లను సిమెంటు, కాంక్రీటు (సీసీ)గా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ఒక్కో పల్లెకు రూ.5 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు మంజూరు చేశారు. ఆయా పనులు ఈ నెలాఖరు వరకు చేపట్టాలి. లేదంటే నిధులు వెనక్కి మళ్లే ప్రమాదం పొంచి ఉంది. దీంతో ఉపాధి నిధులతో చేపట్టాల్సిన సీసీ రహదారుల నిర్మాణంలో వేగం పెంచారు కానీ బిల్లులకు బ్రేక్ పడింది.

40 శాతానికి మించిన పనులు

ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులు 60 శాతం కూలీలు, 40 శాతం మెటీరియల్ కంపోండ్స్‌తో నిర్వహించాల్సి ఉంటుంది. జిల్లాలో ఈ నెల 6 వరకు 48 శాతం వరకు మెటీరియల్ కాంపౌండ్స్ కింద పనులు చేశారు. జిల్లాకు కేటాయించిన 40 శాతం వినియోగం పూర్తవడంతో పూర్తి చేసిన పనులను ఆన్‌లైన్ చేసి బిల్లులు చేసేందుకు జిల్లాకు చెందిన బిల్లులు నిలిపివేశారు. దీంతో ఈ నెల 6వ తేదీ నుంచి ఆయా శాఖల్లో ఉపాధి హామీ పనులకు సంబంధించి మెటీరి



యల్ కాంపౌండ్స్ పనులకు సంబంధించి బిల్లులు కావడం లేదు.

ల్లాలో 1200 పనులు మంజూరు

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద మెటీరియల్ కాంపౌండ్స్‌తో 1200 పనులు మంజూరు చేశారు. బిల్లుల ప్రక్రియ నిలిపివేసిన ఈ నెల 6వ తేదీ వరకు జిల్లాలో 619 పనులు పూర్తయ్యాయి. 296 పనులు కొనసాగుతున్నాయి. ఇంకా 375 పనులు ప్రారంభం కావాల్సి ఉంది. ప్రారంభించని పనులన్నీ ఇంకో ఆరు రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంది. ఒక వైపు బిల్లులు నిలిచిపోవడం... మరో వైపు మంజూరైన పనులను ప్రారంభించే గడువు దగ్గర పడుతుండటంతో పనులు చేపట్టిన వారిలో ఆందోళన నెలకొంది. ఈ నెల చివరి వరకు మంజూరైన పనులు ప్రారంభం కానట్లయితే రద్దు కానున్నాయి.

పనులు విభాగాలు చేసి..

రూ.5 లక్షల వరకు నామినేషన్ పద్ధతిలో పనులు చేపట్టాలి. అంతకు మించితే టెండర్లు పిలవాలి. అత్యధిక గ్రామాల్లో పనులను విభాగాలుగా చేసి రూ.5 లక్షల లోపు నిధులతో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులే చేపట్టారు. బిల్లులు సకాలంలో అందకపోవడంతో కొందరు పూర్తి చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. మార్చిలో ఎలాగోలా ప్రారంభిస్తే ఆ తర్వాత ఆర్థిక సంవత్సరంలోనూ పూర్తి చేయొచ్చనే కోణంలో కొందరు గుత్తేదారులు జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది.

# పెద్దమ్మతల్లి ఆలయ పాలక మండలి నియామకం

పాల్వంచ : పెద్దమ్మతల్లి ఆలయానికి నూతన పాలక మండలిని నియమిస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి అనిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గత పాలకవర్గ పదవీ కాలం అక్టోబరు, 2022లో ముగిసిన విషయం తెలిసిందే. గత ఐదు నెలలుగా నిర్వహణ ఈఓ పర్యవేక్షణలో కొనసాగుతోంది. గత మండలిలో 12 మందికి అవకాశం కల్పించగా.. వారికి అదనంగా ఈ సారి మరో ఇద్దరికి కొత్తగా ప్రాతినిధ్యం కల్పించడం విశేషం. మరో ఏడాది పదవీ కాలంతో పునరుద్ధరించిన మండలిలో మహిపతి రామలింగం, ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, బండి చిన్నవెంకటేశ్వర్లు, కిలారు నాగమల్లేశ్వరరావు, సందుపట్ల శ్రీనివాసరెడ్డి, ముత్యాల ప్రవీణ్‌కుమార్, చింతా నాగరాజు,



మలోత్ సువాలి, గంధం వెంగళరావు, బేతంశెట్టి విజయ్‌కుమార్, ఆడెపు చిన్న వెంకటరామయ్య, కాటారపు లక్ష్మీనారాయణ, సంకా వెంకటరామారావు, పాయం పాపయ్యలకు చోటు దక్కింది. పంచామృతాభిషేకం.. జగన్నాథపురం-కేశవాపురం గ్రామాల నడుమ కొలువైఉన్న పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రవికుమార్‌శర్మ, నరసింహమూర్తి, దుర్గాప్రసాద్, వేదపారాయణదారు పద్మనాభశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి అమ్మవారి జన్మస్థలం వద్ద పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం అర్చకులు మూలవిరాట్‌కు పంచామృతా భిషేకం, పంచ హారతి, నివేదన, నీరాజన మంత్రపుష్పం అందజేశారు. శ్రీదేవీ వసంత నవరాత్రోత్సవాల్లో మూడో రోజు వేడుకలు ఘనంగా కొనసాగాయి.

# పుష్కర వేడుక.. సమస్యల పాచిక..!



భద్రాచలం : ప్రపంచమంతటా శ్రీరామునికి భక్తులున్నారు. భద్రాచలంలో నిర్వహించే శ్రీరామనవమి వేడుకలకు వేలాది మంది వస్తుంటారు. ప్రత్యక్ష ప్రసారాల ద్వారా లక్షలాది మంది ఈ సంబురాలను చూసి మురిసిపోతుంటారు. దీనికి తోడు ఈసారి సామ్రాజ్య పుష్కర పట్టాభిషేకం జరగనుంది. ఈ వేడుక భక్తులకు పరమానందం కలిగించాలని ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహించినా ప్రభుత్వ శాఖల పనితీరులో చలనం లేదు. కొద్దిరోజులులుగా పట్టణంలో ముందస్తు సమాచారం ఇవ్వకుండా విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిరంతరం విద్యుత్తు లోపాలు సరిచేస్తున్నామని చెబుతున్నా సరఫరా మెరుగుపడకపోవటం గమనార్హం.

తనిఖీలు ఎక్కడా..?

శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభమైనా ముందస్తు జాగ్రత్తలు పాటించాల్సిన అధికారుల జాడ కనిపించటం లేదు. బ్రహ్మోత్సవాలకు లక్ష మందికిపై భక్తులు వస్తారని అంచనా. దీనిని దృష్టిలో ఉంచుకుని తూనికలు- కొలతల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో దుకాణాలను తనిఖీ చేయాల్సినప్పటికీ విస్మరించారు. ఆహార పదార్థాలు నాణ్యంగా ఉన్నాయో లేదో నిర్ధారించేందుకు హోటళ్లు, రామాలయంలోని ప్రసాదాల తయారీ ప్రక్రియను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పరిశీలించాలి. ఈ విషయంలో సంబంధిత విభాగం పర్యవేక్షణ ఎక్కడా కనిపించడం లేదు. 29న ఎదుర్కోలు, 30న శ్రీరామనవమి, 31న సామ్రాజ్య పుష్కర పట్టాభిషేకం ఉత్సవాలు జరగనున్నాయి. మూడు రోజుల పాటు భద్రాచలంలో మాంసం, మద్యం విక్రయించొద్దని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇవి పక్కాగా అమలుకావాలంటే పట్టణంలో వందలాది గొలుసుకట్టు దుకాణాలపై దృష్టి సారించాలి. ఆలయ పరిసరాలతో పాటు వివిధ కాలనీల్లో గుడుంబా విక్రయాలు జోరుగా సాగుతున్నందున ఆబ్కారీ శాఖ విజిలెన్స్ బృందాలు నిఘా పెంచాలని భక్తులు కోరుతున్నారు.

పారిశుద్ధ్యం.. పరిహాసం

భద్రాచలం గ్రామ పంచాయతీని 15 జోన్లుగా విభజించి ప్రతిదానికీ ఎంపీవోను ఇన్‌ఛార్జిగా నియమించారు. సుమారు 400 మంది కార్మికులు పారిశుద్ధ్య పనులు చేపడతారు. ఎంపీవోల పరిధిలో నలుగురు చొప్పున కార్యదర్శులు ఉంటారు. ఇలాంటి ఉత్సవాల సమయాల్లో ఆలయ పరసరాల్లో మాత్రమే పారిశుద్ధ్యంపై దృష్టి సారించి కాలనీలను విస్మరిస్తున్నారనే ఆరోపణలను పరిగణనలోకి తీసుకోవాలి. గోదావరి నీటి మట్టం తక్కువగా ఉందనే ఉద్దేశంతో నీటి లోతు తెలియక భక్తులు ప్రమాదానికి గురయ్యే అవకాశముంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని గజ ఈతగాళ్లు, పడవలను సిద్ధంగా ఉంచాలి. తాగునీటి సరఫరాకు ఎన్ని ఏర్పాట్లు చేసినా మిథిలా మండపంలో ఉక్కపోత కారణంగా మజ్జిగ పొట్లాలనూ అందుబాటులో ఉంచాలి. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు శ్రీరామనవమి ఉత్సవాల నేపథ్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాం. కాలనీల్లో రోజువారీగా సిబ్బందితో పనులు జరుగుతూనే ఉంటాయి. అదనపు సిబ్బందితో దోమల మందు పిచికారి చేయిస్తున్నాం. ఎం. వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి

# బహుళ ప్రయోజనం.. మరమ్మతుల్లో విఫలం

రుద్రంగి : వర్షాకాలంలో కురిసిన ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి ఎక్కడికక్కడ నిల్వ ఉండేటట్లు చేస్తే వేసవిలో అవి వెలకట్టలేనంతగా ఫలితాలనిస్తాయి. చిన్న చిన్న కుంటలు, చెక్‌డ్యాంలను నిర్మించి నీటిని నిల్వ చేయాలనే లక్ష్యంతో సుమారు రెండు దశాబ్దాల క్రితం అప్పటి ప్రభుత్వాలు చేపట్టిన నిర్మాణాలు అధిక వర్షాల వల్ల ధ్వంసమయ్యాయి. వాటికి మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించటంతో నిరుపయోగంగా మారాయి. దీంతో వేసవిలో మెట్ట ప్రాంతంలో భూగర్భ జలాలు పడిపోవడంతో ఓ వైపు రైతులు పంటలకు నీరందించడానికి, మరోవైపు తాగు నీరు దొరకక అడవుల్లో మూగజీవాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రుద్రంగి మండలంలో సుమారు 30కి పైగా చిన్నా, పెద్దా చెక్‌డ్యాంలున్నాయి. ఇవి ప్రధానంగా లీకేజీలు, కరకట్టల గోడలు ధ్వంసమై ఉపయోగపడని పరిస్థితి నెలకొంది. రుద్రంగి-మానాల మధ్యనున్న అటవీ ప్రాంతంలో ప్రధాన రహదారికి దాదాపు 2 కి.మీ.ల దూరంలో చెట్టు కింద సూరమ్మ దేవత వెలసిన చోట పదిహేనేళ్ల క్రితం చెక్‌డ్యాం నిర్మించారు. దీంతో ఇక్కడ వరుసగా రెండు సంవత్సరాలు వర్షాలు కురవకపోయిన నీరు నిల్వ ఉండేదని పశువుల కాపరులు చెబుతున్నారు. భారీ వర్షాలకు చెక్‌డ్యాం గోడలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో కురిసిన వర్షపు నీరంతా దిగువకు పోతోంది. సంవత్సరాలు గడిచినా బాగు చేయలేదు. రుద్రంగి-మానాల అటవీ ప్రాంతంలో సీమర్లుగా పిలిచే 2వ ఘాట్ రోడ్డును ఆనుకొని ఉన్న మరో చెక్‌డ్యాం కూడా ధ్వంసమై దాదాపు 12 ఏళ్లు అవుతోంది. వర్షాకాలం వానలు ఆగిపోయిన తర్వాత కూడా మార్చి వరకు ఊటల ద్వారా ప్రవహించే ఈ వాగుపై దీన్ని కట్టారు. అయితే పనుల్లో నాణ్యత లేకపోవడం, కరకట్టకు రాతికట్టడం నిర్మించకపోవడంతో భారీ వర్షాలకు కరకట్ట తెగిపోయి నీరు వృథాగా దిగువకు వెళ్లిపోతోంది.

పునర్నిర్మాణం చేపడితే.. ధ్వంసమైన చెక్‌డ్యాంలను పునర్నిర్మాణం చేస్తే వేసవి కాలంలో అటవీ జీవాలకు తాగు నీటి వసతి ఏర్పడుతుంది. మైదాన ప్రాంతాల్లోని పంట పొలాలకు వన్యప్రాణుల రాకను తగ్గించవచ్చు. చెక్‌డ్యాంలు ఉన్న పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయి. ఫలితంగా పంటలకు ఇబ్బంది ఉండదు. వరద ప్రవాహాన్ని నియంత్రించడం ద్వారా నేలకోతను తగ్గించవచ్చు. అడవిలోని చెట్లు ఎల్లప్పుడూ పచ్చదనాన్ని సంతరించుకుని వేసవిలో అడవుల్లో చెలరేగే కార్చిచ్చును కొంత మేరకైనా అరికట్టవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీటిని పునర్నిర్మించాలని రైతులు కోరుతున్నారు. అధికారులు స్పందించాలి

- ఉప్పులూటి గణేష్, రైతు, రుద్రంగి

చెక్‌డ్యాంలు ధ్వంసమై దశాబ్దానికి పైగా అవుతున్నా అధికారుల నిర్లక్ష్యంతో వాటికి మరమ్మతులు చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అటవీ ప్రాంతంలోని చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేపట్టాలి. భూగర్భ జలాలు పెరుగుతాయి- సుడిగెపు వెంకటేష్, రైతు, రుద్రంగివర్షాకాలంలో కురిసిన ప్రతి నీటి చుక్కను పొదుపు చేయాలంటే ధ్వంసమైన చెక్‌డ్యాంలు, కుంటలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలి. భూగర్భ జలాల లోటు సమస్య పరిష్కారానికి వీటికి మరమ్మతులు తప్పనిసరి. అడవుల్లోని మూగజీవాలకు వేసవిలో తాగు నీటికి ఇవే ప్రధాన వనరు. అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పనులు చేపట్టాలి. మరమ్మతులకు నిధులు లేవు- రాఘవేందర్‌రావు, డిప్యూటీ రేంజ్ అధికారి, చందుర్తి, రుద్రంగి

రుద్రంగి-మానాల అటవీ ప్రాంతంలో దశాబ్దం క్రితం ధ్వంసమైన చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేసేందుకు ప్రస్తుతం నిధులు లేవు. గతంలో మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపిన విషయం వాస్తవమే. నిధులు మంజూరు కాకపోవడంతో పనులు చేయలేదు. నిధులు వస్తే మరమ్మతులు చేయిస్తాం.

# పనులు పూర్తికావు.. ప్రయాణ కష్టాలు తీరవు

సిరిసిల్ల : రహదారుల మరమ్మతులు, వంతెనల నిర్మాణాలకు ఎన్నిసార్లు టెండర్లు పిలిచినా స్పందన లేదు. గతంలో ఏదైనా ప్రభుత్వ పని ఉందంటే గుత్తేదారులు పోటీ పడి తక్కువ ధరకు టెండర్లు వేసి పని దక్కించుకునేవారు. ప్రస్తుతం పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉన్నాయి. టెండర్లకు ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా జిల్లాలోని పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని రహదారుల మరమ్మతులు ముందుకు సాగడం లేదు. చేసిన పనులకైనా బిల్లులు వస్తున్నాయా? అంటే అదీ లేదు. వీటికీ తీవ్ర జాప్యం జరుగుతోంది. చాలా పనులు అసంపూర్తి దశలో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఏడు మండలాల పరిధిలో రహదారుల పరిస్థితి ఇది.

రహదారుల తీరు రుద్రంగి మండలం మానాల రింగ్‌రోడ్డు గైరిగుట్టతండా మీదుగా రుద్రంగికి 2.42 కిలోమీటర్ల రహదారి పనులకు రూ. 60.38 లక్షలు మంజూరయ్యాయి. పనులు చేసేందుకు ఇప్పటికీ ఆరు సార్లు టెండర్లు పిలిచినా ఫలితం లేదు. చందుర్తి మండలం లింగన్నపేట, సనుగుల రహదారి పరిస్థితి అలానే ఉంది.

బోయినపల్లి నుంచి బూర్గుపల్లి, కోరెం, అనంతపల్లి గ్రామాల మీదుగా కొడిమ్యాల మండలం నల్లగొండ రహదారి తారు లేచిపోయి కంకర తేలి గుంతలతో అధ్వానంగా ఉంది. దేశాయిపల్లి, రత్నంపేట, రామన్నపేట ప్రజలు అయ్యోరుపల్లి మీదుగా వేములవాడ వెళ్లే రహదారి తారు లేచిపోవడంతో ప్రయాణం ఇబ్బందిగా మారింది. అలాగే విలాసాగర్ నుంచి నాగులమల్యాల, కోరెం నుంచి దుంద్రపల్లి రహదారిలోనూ గుంతలు పడ్డాయి. ముస్తాబాద్ మండలం మద్దికుంట, మొర్రాయిపల్లి, తెర్లుమద్ది, గోకవాడ, బందనకల్, బంజేరుపల్లి ఇలా అయిదు గ్రామాలకు వెళ్లే రహదారుల పనులు అసంపూర్తి దశలో ఉన్నాయి. మోహినికుంట మీదుగా రాజక్కపేటకు వెళ్లే రహదారి తారు లేచిపోయింది. రూ. 1.87 కోట్లు మంజూరైనా టెండర్ల దశలోనే ఉంది. కోనరావుపేట మండలం కొండాపూర్, నిజామాబాద్, వెంకటాపూర్, కనగర్తి, మర్తన్నపేట, ఎగ్లాస్‌పూర్ రహదారుల మరమ్మతులు ముందుకు సాగడం లేదు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ పోతిరెడ్డిపల్లి రహదారుల మరమ్మతులకు టెండర్లు దక్కించుకున్నా పనులు ప్రారంభం కాలేదు. ఇదే మండలంలో కోరుట్లపేట, నారాయణపేట రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. మూడేళ్లుగా కనీస మరమ్మతులకు నోచుకోవడం లేదు.

పెండింగ్‌లో రూ. 5.08 కోట్లు

జిల్లా వ్యాప్తంగా టెండర్ దశలో కొన్ని, గుత్తేదారుల నిర్లక్ష్యంతో మరికొన్ని రహదారుల పనులు ముందుకు సాగడం లేదు. అధ్వాన రహదారులతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో వంతెనలు, రహదారుల మరమ్మతులు 69.06 కిలో మీటర్లకు గాను రూ. 33.26 కోట్లతో పనులు చేపట్టారు. వీటిలో మూడు చోట్ల వంతెనలు, నాలుగు చోట్ల రహదారుల నిర్మాణానికి గుత్తేదారులు టెండర్లకు రావడం లేదు. టెండర్లు పూర్తయి ఒప్పందం జరిగిన వాటిలో ఇప్పటికీ 19.70 కిలోమీటర్ల మేరకు మరమ్మతులు జరిగాయి. వీటికి గుత్తేదారులకు రూ. 5.08 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. చేసిన పనులకు బిల్లులు రాక మిగతావి ముందుకు కదలని పరిస్థితి నెలకొంది.

వంతెన నిర్మించాలి

అడవిపదిర వద్ద కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మాణం చేపట్టాలి. వర్షాకాలంలో కాజ్‌వేపై నుంచి వరద వెళ్లడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాత్రి వేళ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా వంతెన నిర్మాణం చేపట్టాలి.

మనోజ్, అడవిపదిర

గడువులోగా పూర్తి చేస్తాం

రహదారులు ఎక్కువగా దెబ్బతిన్న చోట మరమ్మతులు జరుగుతున్నాయి. వంతెన నిర్మాణాలకు టెండర్లు పిలిచాం. పనులు దక్కించుకున్న గుత్తేదారులు ఒప్పందం చేసుకునేలా చూస్తున్నాం. గడువులోగా పనులు పూర్తి చేస్తాం. సూర్యప్రకాశ్, ఈఈ, పంచాయతీరాజ్‌శాఖ

# బియ్యం పంపిణీలో కోత



పాల్వంచ : పేదలకు అందాల్సిన రేషన్ బియ్యంలో కోతపడింది. జిల్లా తెల్ల రేషన్ కార్డుదారులకు మూడు నెలలుగా పూర్తి స్థాయిలో రేషన్ అందడం లేదు. కేంద్రం నుంచి విడుదలవుతున్న 5 కిలోల బియ్యాన్నే పంపిణీ చేసి అధికారులు మమ అనిపిస్తున్నారు. ఫలితంగా పూర్తి స్థాయి అవసరాలు తీరక వీటిపైనే ఆధారపడుతున్న పేదలు ఇబ్బందులు పడుతున్నారు.

భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో 442 చౌక దుకాణాలున్నాయి. మొత్తం 2,94,026 రేషన్ కార్డులు ఉన్నాయి. కరోనాకు ముందు కార్డులో ఉన్న ఒక్కొక్కరికీ 6 కిలోల చొప్పున బియ్యం అందించేవారు. కరోనా అనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) ద్వారా ఉచిత పంపిణీకి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి తెల్ల రేషన్ కార్డులో పేరున్న ఒక్కొక్కరికి 10 కిలోల బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేశారు. నాటి నుంచీ ఈ రాయితీని పొడిగిస్తూ వస్తోంది. ఇటీవల 2023, డిసెంబరు వరకు ఉచితంగా అందజేస్తామని కేంద్రం ప్రకటించింది. కానీ జిల్లాలో మూడు నెలలుగా కేవలం 5 కిలోల బియ్యాన్నే కార్డుదారులకు అందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ వాటా కోత విధించడంతోనే ఈ పరిస్థితి అని సమాచారం. పౌరసరఫరాల అధికారులు మాత్రం ఏమీతెలియనట్టు మౌనం వహిస్తున్నారు. వచ్చిన సరకు రేషన్ దుకాణాలకు పంపించి మిన్నకుంటున్నారు. పండుగల సమయంలోనూ పూర్తి స్థాయిలో రేషన్ అందక లబ్ధిదారులు వచ్చిన వాటితోనే సరిపెట్టుకున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో అందించాలని కోరుతున్నారు.

"రేషన్ బియ్యం పూర్తి స్థాయిలో అందక ఇబ్బంది పడుతున్నాం. వేసవి తరుణంలో పనులు దొరక్క, చాలినన్ని బియ్యం రాక పూట గడవడం కష్టంగా ఉంది. అధికారులు స్పందించి గతంలో లాగానే 10 కిలోలు బియ్యం అందించాలి."

ఆదినారాయణ చినరాజుపేట

"ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే రేషన్ సరఫరా చేస్తున్నాం. డిసెంబరు వరకు 10 కిలోల చొప్పున బియ్యం అందించాం. జనవరి నుంచి 5 కిలోలే వస్తున్నాయి. జిల్లాకు అందే కోటాను బట్టి లబ్ధిదారులకు సరఫరా ఉంటుంది."మల్లికార్జునబాబు, డీసీఎస్వో

# తరుముతున్న గడువు.. కదలనంటున్న పనులు..!



ఖమ్మం :.. ఇదిగో ఇలా చెట్ల కిందే పాల్వంచ మండలం దంతెలబోర ఎస్సీకాలనీ పంచాయతీ సమావేశాలు జరుగుతాయి. ఆ సమయంలో వర్షం కురిస్తే సమావేశం వాయిదా పడాల్సిందే. ఓ చిన్న గదిలో పంచాయతీ దస్త్రాలు భద్రపరుస్తారు. పంచాయతీ భవన నిర్మాణానికి రూ. 20లక్షలు మంజూరైనా పనులు ప్రారంభించకపోవడం గమనార్హం. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలన్నా... ప్రజా సమస్యలు పరిష్కారం కావాలన్నా పంచాయతీ కార్యాలయాలే కీలకం. అయితే చాలాచోట్ల ఐసీడీఎస్ వంట గదులు, అదనపు తరగతి గదులు, అద్దె భవనాల్లో అరకొర వసతుల నడుమ పంచాయతీ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. అవసరమైనచోట భవనాల నిర్మాణానికి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద అనుమతులు ఇచ్చినా అనేక ప్రాంతాల్లో పనులు ప్రారంభం కాలేదు.

ఖమ్మం జిల్లాలో 589 పంచాయతీలున్నాయి. 190 పంచాయతీలకు కార్యాలయాల భవనాల సదుపాయం లేదు. గతేడాది ఉపాధి హామీ పథకం కింద 124, ఐటీడీఏ కింద 66 పంచాయతీలకు కొత్త భవనాల నిర్మాణానికి రూ. 20లక్షల చొప్పున మంజూరయ్యాయి. ఎక్కడా పనులు పూర్తికాలేదు. 15 భవనాల నిర్మాణాలకు స్థలం దొరకలేదు.

ఏడు రోజుల్లో వెనక్కే.. ఉపాధి హామీ పథకం నిధులను ఈ ఆర్థిక సంవత్సరంలో వినియోగించుకోకుంటే వెనక్కి వెళ్లే అవకాశముంది. ఏడు రోజుల వ్యవధి మాత్రమే ఉంది. ఈ తక్కువ వ్యవధిలో భవనాలను ప్రారంభించడం సాధ్యపడుతుందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. కొద్దోగొప్పో పనులు చేసి కనీసం కూలీలకైనా చెల్లించినట్లు మస్టర్లు రూపొందించుకునే దిశగా ఎవరూ చర్యలు చేపట్టడం లేదు.

ఉపాధి హామీ పథకం కింద 124, ఐటీడీఏ కింద 66 పంచాయతీలకు కొత్త భవనాలు మంజూరయ్యాయి. కొన్నిచోట్ల నిర్మాణాలు మొదలయ్యాయి. 15 భవనాలకు అనువైన స్థలం దొరకలేదు. పంచాయతీ భవనాల నిర్మాణ పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేస్తాం.

అప్పారావు, ఇన్‌ఛార్జి డీపీవో

మా పంచాయతీ సమావేశాలను చెట్లకిందే నిర్వహిస్తున్నాం. కొత్త భవనం నిర్మాణానికి ఈజీఎస్ కింద రూ. 20లక్షలు మంజూరయ్యాయి. వెంటనే పనులు ప్రారంభించాలి. నిధులు వెనక్కి వెళితే వస్తాయో రావో అర్థం కావట్లేదు. రమేశ్, సర్పంచి, దంతెలబోర ఎస్సీకాలనీ

# పరిశ్రమలకు రాయితీ ఏదీ?

సిరిసిల్ల : పారిశ్రామిక అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకొచ్చే వారికి సత్వర అనుమతులు ఇవ్వాలనే ఉద్దేశంతో టీఎస్-ఐపాస్ విధానాన్ని అమలు చేస్తోంది. టీ-ప్రైడ్, టీ-ఐడియా పథకాల ద్వారా ప్రోత్సాహకాలు అందజేస్తోంది. అయితే ఆచరణలో మాత్రం ఆలస్యమవుతుండటంతో పారిశ్రామికవేత్తలు నిరాశకు గురవుతున్నారు. పరిశ్రమల ఏర్పాటుతో వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తోంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా, భారీ పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ఆదుకోవాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం టీ-ప్రైడ్ ద్వారా ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు పలు రాయితీలు అందజేస్తోంది. పెట్టుబడి రాయితీ పురుషులకు (35 శాతం, మహిళలకు 45 శాతం, గరిష్ఠంగా రూ. 75 లక్షల వరకు), విద్యుత్తును యూనిట్కు రూ. 1.5 ఇస్తోంది. అలాగే పావలా వడ్డీకి రుణాలతోపాటు వాహనాలకు రాయితీ అందజేస్తోంది. కార్మిక క్షేత్రమైన సిరిసిల్లలో టెక్స్‌టైల్ పరిశ్రమతో పాటు గ్రానైట్ పరిశ్రమలు, వాహనాలకు రాయితీ ఇస్తున్నారు. టీ-ఐడియా పథకం ద్వారా పరిశ్రమలను నెలకొల్పడానికి ముందుకొచ్చే అన్ని వర్గాలకు ప్రోత్సాహకాలు ఇస్తోంది. పెట్టుబడి రాయితీ కింద పురుషులకు (15 శాతం, మహిళలకు 25 శాతం) పావలా వడ్డీకి రుణాలు, విద్యుత్తు యూనిట్కు రూ. 1 చెల్లిస్తోంది. రాయితీలు అయిదేళ్ల వరకు వర్తిస్తాయి. విద్యుత్తు రాయితీ, పావలా వడ్డీకి ఆరు నెలలకు ఒకసారి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. గడువు దాటినా ఆరు నెలల నుంచి ఏడాదిలోపు దరఖాస్తు చేస్తే రాయితీలో సగం మాత్రమే చెల్లిస్తారు. పెట్టుబడి రాయితీని మాత్రం ఒకసారే ఇస్తారు. ఇదీ పరిస్థితి... గత ఎనిమిది సంవత్సరాలుగా రాయితీ నిధులు అందడం లేదని జిల్లాలోని పలువురు పారిశ్రామికవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నూతన యంత్రాలు అమర్చుకొని ఉత్పత్తిని పెంచాలని చూస్తున్న వారికి ఇది ఆర్థికంగా ఇబ్బందికరంగా మారింది. రావాల్సిన బకాయిలు రాక, కొత్త యంత్రాలు సమకూర్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లు కావస్తున్నా ప్రోత్సాహకాలు రాకపోవడంతో నిరాశ, నిస్పృహలో ఉన్నారు. అప్పులు తెచ్చి పరిశ్రమలు ఏర్పాటు చేసి వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. రాయితీ నిధులు విడుదల చేయాలని వారు కోరుతున్నారు.

ఇప్పటివరకు మంజూరైన రాయితీ వివరాలు (రూ.ల్లో)

రాష్ట్ర స్థాయి కమిటీ (ఎస్ఎల్‌సీ): 103,83,01,687

జిల్లా స్థాయి కమిటీ (డీఎల్‌సీ): 10,39,55,197

రావాల్సినది...

ఎస్ఎల్‌సీ: 33,56,20,958

డీఎల్‌సీ: 15,79,79,227

ఎనిమిదేళ్ల నుంచి రావడం లేదు

మాకు 2015 సంవత్సరంలో రాయితీ నిధులు మంజూరు చేస్తున్నట్లు లేఖ వచ్చింది. కానీ ఇంత వరకు ఇవ్వలేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రాయితీ రాక, అప్పులు చెల్లించలేక పరిశ్రమ ఇబ్బందుల్లో ఉంది. కరోనా కాలంలో సైతం తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ఈ ఇబ్బందులు తాళ లేక మా వ్యాపార భాగస్వామి మనస్తాపంతో మృతి చెందారు. ప్రభుత్వం పారిశ్రామికవేత్తల సమస్యలను పరిష్కరించాలి. రాయితీ నిధులను అందించాలి. ప్రవీణ్, పారిశ్రామికవేత్త, గ్రానైట్ పరిశ్రమ, వెంకట్రావుపల్లె

ఆందోళన చెందొద్దు

# కబ్జాదార్లకు చిక్కి.. చిక్కిపోతున్న చెరువులు

ఆసిఫాబాద్ : వాంకిడి మండలం ఇందాని గ్రామ సమీపంలో ఉన్న చెరువులోనే ఇటుక బట్టీని ఏర్పాటు చేశారు. మట్టి సైతం చెరువులో నుంచి తవ్వుతున్నారు. చెరువు చుట్టూ ఉన్న భూమిని ఎత్తుగా చేసి, కొందరు వ్యక్తులు పంటలు పండిస్తున్నారు. 250 ఎకరాలకు సాగు నీరు అందించాల్సిన చెరువు నీటి నిల్వ సామర్థ్యం కోల్పోవడంతో నేడు ఎకరానికి కూడా సాగు నీరు అందించడం లేదు. అన్నదాతల పొలాలను తడిపే జలవనరులు క్రమంగా కుచించుకుపోతున్నాయి. కబ్జాదారుల చేతుల్లో చిక్కి నిర్మాణాలుగా, చేలుగా రూపొందుతున్నాయి. కొన్నిచోట్ల వీటిని ఇతరులకు కౌలుకు ఇచ్చి మరీ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటుండడం గమనార్హం. నీటిపారుదల, రెవెన్యూ అధికారులను సర్వే చేసి, హద్దులు చూపాలని పలుమార్లు కోరినా స్పందన ఉండటం లేక ఏటికేడు చెరువులు, జలాశయాల భూములు అన్యాక్రాంతమవుతూ బక్కచిక్కిపోతున్నాయి. కొన్నిచోట్ల పట్టాలు సైతం జారీ చేయడంతో పక్కా నిర్మాణాలను చేపడుతున్నారు.

లి జిల్లాలో నాలుగు మధ్య తరహా సాగునీటి జలాశయాలు, నాలుగు చిన్నతరహా జలాశయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 1.20 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. 'మిషన్ కాకతీయ'లో నాలుగు విడతల్లో 164 చెరువులను ఆధునికీకరించగా వీటికి 15 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. మండల కేంద్రాల్లో ఉన్న చెరువు శిఖం భూముల్లో గృహాలను నిర్మిస్తున్నారు. చెరువు శిఖం భూములను క్రమంగా మట్టితో పూడ్చి ఎత్తు పెంచేస్తున్నారు. ఈ మట్టి పూడ్చడం ఏటికేడు ఎక్కువగా చేయడంతో జలాలు కింది భాగానికే పరిమితమవుతున్నాయి. ఇక్కడ సాగుతో పాటు, ఇటుక బట్టీలు, నిర్మాణాలు చేపడుతున్నారు.

సిర్పూర్(టి) మండల కేంద్రంలో నాగమ్మ చెరువులో రహదారి పొడవునా ఆక్రమణలు జరుగుతున్నాయి. 20 ఎకరాల శిఖం భూములకు సైతం పట్టాలు జారీ అయ్యాయని నీటిపారుదల అధికారులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. నేటివరకు ఇక్కడ చెరువు రక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

జిల్లాలో ఉన్న కుమురం భీం, వట్టివాగు రెండు ప్రధాన జలాశయాలు. వీటి పరిధిలో వందల ఎకరాల భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. వట్టివాగు వద్ద 160 ఎకరాల భూమి కబ్జాలో ఉందని అధికారులు గతంలోనే గుర్తించారు. మట్టి పోస్తూ క్రమంగా జలాశయాన్ని ఒకవైపు నుంచి పూడ్చివేస్తున్నారని అధికారులు రెవెన్యూ యంత్రాంగానికి వివరాలు ఇచ్చినా సర్వేయర్ లేరనే నెపంతో ఎలాంటి హద్దులు గుర్తించలేదు. ఇరుశాఖల మధ్య కొరవడిన సమన్వయం కారణంగా ప్రాజెక్టు భూములు పరులపరం అవుతున్నాయి. ఇక్కడి భూములన్నీ ఆక్రమించిన రైతులు ఇతరులకు కౌలుకు ఇవ్వడం గమనార్హం. ప్రతి చెరువు వద్ద 20 నుంచి 50 ఎకరాల వరకు భూముల చొప్పున వేల ఎకరాలు ఇతరుల చేతుల్లో చేలుగా మారాయని అధికారులు గతంలోనే తేల్చారు. జిల్లా వ్యాప్తంగా ఈ భూముల రక్షణకు చర్యలు తీసుకోవడంలో మాత్రం తాత్సారం చేస్తున్నారు.

నాసిరకం పనులు..కారణమే..

'భగీరథ' నాలుగు విడతల్లో చేసిన పనులు నామమాత్రంగానే పూర్తి చేశారు. వాస్తవంగా చెరువు భూముల్లో పూడిక తొలగిస్తే ఆక్రమణలు ఉండేవి కావు. పూడికను అలాగే ఉంచి కట్టల మరమ్మతులు చేశారు. వీటిపైనే మట్టి వేసుకుంటూ కొందరు వ్యక్తులు ఆక్రమణలకు పాల్పడుతున్నారు.

రెవెన్యూ అధికారులను సంప్రదించాం- ప్రభాకర్, ఈఈ, నీటిపారుదలశాఖ

కబ్జాలు, చెరువు శిఖం భూములకు పట్టాలు తయారుచేసుకున్న తీరుపై రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాం. సర్వేయర్లను నియమించి, కబ్జాలను తొలగిస్తామని చెప్పారు. మరోసారి ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

# సింగరేణి బొగ్గుకు పెరిగిన ఆదరణ

గోదావరిఖని : సింగరేణి బొగ్గు మార్కెట్ విస్తరిస్తోంది.. ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లోని ఎన్టీపీసీ ప్రాజెక్టులకు 13.53 మిలియన్ టన్నుల బొగ్గును సింగరేణి సరఫరా చేస్తోంది. తాజాగా మహారాష్ట్రలోని షోలాపూర్ ఎన్టీపీసీ ప్రాజెక్టుకు 2.54 మిలియన్ టన్నుల బొగ్గు రవాణాకు తాజాగా ఒప్పందం కుదిరింది. ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టుకు 6.85 మిలియన్ టన్నుల సరఫరాకు నవంబరు 10న సింగరేణి యాజమాన్యంతో ఎన్టీపీసీ సంస్థ ప్రతినిధులు ఒప్పందం చేసుకోగా, తాజాగా మహారాష్ట్రలోని షోలాపూర్ పవర్ ప్లాంటుకు అంగీకారం కుదుర్చుకున్నారు. దీంతెఓ మార్కెట్‌లో మరింత పట్టు సాధించినట్లయింది.



ఎన్టీపీసీకి నమ్మకం

ఎన్టీపీసీ సంస్థ సింగరేణి బొగ్గు తీసుకునేందుకు ముందుకొస్తోంది.. సింగరేణిపై పూర్తి నమ్మకం ఉండటంతో మిగతా సంస్థలతో అవకాశం ఉన్నా వాటిని పక్కనపెట్టి సింగరేణితో అంగీకారం కుదుర్చుకుంటోంది. మహారాష్ట్రలోని ఎన్టీపీసీ సంస్థకు కోల్ ఇండియా నుంచి తీసుకోవాల్సి ఉన్నప్పటికీ దాన్ని పక్కన పెట్టి సింగరేణి ద్వారా తీసుకోవడానికి ఆసక్తి చూపింది. దీనికోసం కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నుంచి అనుమతి తీసుకుంది. అదేవిధంగా ఇదివరకే ఒప్పందం చేసుకున్న తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టుకు కూడా మొదట మందాకిని కోల్‌బ్లాకు నుంచి బొగ్గు సరఫరాకు అవగాహన చేసుకుంది. ప్రస్తుతం దాన్ని రద్దు చేసుకుని సింగరేణితో అంగీకారం కుదుర్చుకుంది.

ఎనిమిది రాష్ట్రాలకు బొగ్గు రవాణాఎన్టీపీసీ ప్లాంటున్న ఎనిమిది రాష్ట్రాలకు సింగరేణి సంస్థ బొగ్గు రవాణా చేస్తోంది. ఇదివరకే కర్ణాటక, చత్తీస్‌ఘడ్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌తో పాటు తాజాగా మహారాష్ట్రలోని విద్యుత్తు కేంద్రాలకు సరఫరా చేస్తోంది. దేశవ్యాప్తంగా మార్కెట్‌ను విస్తరించుకుంటూ వస్తున్న సింగరేణికి ఎన్టీపీసీ సంస్థ అతిపెద్ద వినియోగదారు.. 13.53 మిలియన్ టన్నుల వరకున్న బొగ్గు సరఫరా తాజాగా 2.54 మిలియన్ టన్నులకు చేరింది. దీంతో మొత్తం ఎన్టీపీసీకి 16.07 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరాకు ఒప్పందం కుదిరినట్లయింది.

# కాగజ్‌నగర్ అనుసంధాన రోడ్లపై చిన్నచూపు




కాగజ్‌నగర్: జిల్లాలో వివిధ మండలాలకు అనుసంధానంగా ఉన్న వంతెనలు, రోడ్ల నిర్మాణాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు చిన్నచూపు చూస్తున్నారు. దీంతో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నచందంగా మారింది. సిర్పూరు నియోజకర్గంలోని కాగజ్‌నగర్–వాంకిడి మధ్యలో ఉన్న అంకుసాపూర్ వద్ద బ్రిడ్జి నిర్మాణం 2013లో రూ.1.50 కోట్ల నిధులతో చేపట్టారు. నిధుల విడుదల జాప్యం కావడంతో పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు. ఈ మార్గంలో కేవలం ఎండాకాలం, చలికాలం మాత్రమే రాకపోకలుంటున్నాయి. వర్షాకాలం మాత్రం వరదలుంటున్నాయి. వర్షాకాలంలో వాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది. ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో నిర్మాణం పూర్తి కావడం లేదు. ఇక కాగజ్‌నగర్–అంకుసాపూర్–వాంకిడిని కలిపేందుకు ప్రత్యేక రోడ్డును కూడా ప్రతిపాధించారు. కానీ నిధుల లేమి, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఫలితంగా ఈ ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి కావడం లేదు. నిర్మాణ వ్యయాన్ని రూ.3కోట్లకు రెండేళ్ల క్రితం పెంచారు. ఐనా ఇంతవరకు ఎటువంటి పురోగతి లేదు. కాగజ్‌నగర్ నుంచి వాంకిడి వెళ్లాలంటే ఆసిఫాబాద్ మీదుగా సరిగ్గా 41కిలో మీటర్లు ఉంటుంది. ఆసిఫాబాద్‌కు మీదుగా కాకుండా కాగజ్‌నగర్ నుంచి అంకుసాపూర్ మీదుగా వాంకిడికి వెళ్లితే 25కిలోమీటర్లు వస్తుంది. అధికారులు త్వరితగతిన బ్రిడ్జి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని రెండు మండలాల వాసులు కోరుతున్నారు. కాగజ్‌నగర్–భీమిని మండలాలకు అనుసంధానంగా ఉండేందుకు 2014లో అధికారులు సమగ్రస్థాయిలో సర్వే చేపట్టిన రోడ్లకు, వంతెనల నిర్మాణానికి ప్రతిపానదలు చేపట్టారు. ఇందుకయ్యే ఖర్చు కూడా రూ.10 కోట్ల మేర అంచనాలు రూపొందించారు. నిధులు పూర్తి స్థాయిలో విడుదల కాకపోవడంతో కంకర తేలిన రోడ్లపైన్నే అతి కష్టంగా వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. కాగజ్‌నగర్ నుంచి భీమిని మండలాలకు వెళ్లేందుకు చక్కటి మార్గం జగన్నాథ్‌పూర్ మీదుగా ఉంది. జగన్నాథ్‌పూర్ గ్రామం దాటగానే చిన్నపాటి వాగు ఉంది. వర్షాకాలంలో చిన్నపాటి వర్షం కురిసిందంటే ఇక్కడి రాకపోకలు జరపలేని పరిస్థితి ఉంటుంది. ఎడ్లబళ్ల ద్వారానే ఈ వాగును దాటాల్సిన పరిస్థితి. ఏళ్లు గడుస్తున్నా కూడా అటు రోడ్డు నిర్మాణానికి గానీ ఇటు వంతెన నిర్మాణానికి గాని ఎలాంటి పురోగతి లేదు. భీమిని నుంచి నిత్యం కాగజ్‌నగర్‌కు ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో ప్రజలు వివిధ అవసరాల కోసం వస్తుంటారు. అధికారులు, నాయకులు స్పందించి అసంపూర్తిగా ఉన్న అనుసంధాన రోడ్లు, వంతెనలు వెంటనే పూర్తి చేసేట్టు చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పక్కా రోడ్డును నిర్మించాలి..–చిందం శ్రీనివాస్, కాగజ్‌నగర్

అధికారులు స్పందించి పక్కా రోడ్డును నిర్మించాలి. కాగజ్‌నగర్ భీమిని మండల కేంద్రానికి వెళ్లాలంటే కాగజ్‌నగర్ వయా ఇట్యాల మీదుగా భీమిని వెళ్లాల్సి ఉంటుంది. ఇలా వెళ్లితే 27కిలోమీటర్ల దూరం వస్తోంది. అదే జగన్నాథ్‌పూర్ మీదుగా నేరుగా ఖర్జీభీంపూర్, భీమిని వెళ్లేందుకు రహదారి ఉంది. ఇలా వెళితే 22కిలోమీటర్ల దూరం వస్తుంది. భీమిని మండలానికి అతి దగ్గరగా ఉండటంతో ఈ మార్గం గుండానే వెళ్తుంటారు. భీమినిలో రైతులు పండించిన పంటలన్నింటినీ కూడా సమీపంలో ఉండే కాగజ్‌నగర్ వ్యాపారులకే విక్రయిస్తుంటారు. దీంతో ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం అవుతోంది. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి జగన్నాథ్‌పూర్ గ్రామ సమీపంలో ఉన్న వాగుపై వంతెన కడితే బాగుంటుంది.

# అందని 'బంధు'వయా !



ఆదిలాబాద్ : రైతులు పండించిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర రానిపక్షంలో వాటిని నిల్వ ఉంచుకొని రుణం ఇచ్చే సౌకర్యాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీలు తుంగలో తొక్కుతున్నాయి. కేవ లం పంట ఉత్పత్తుల ద్వారా రుసుములు వసూలు చేసుకోవడమే తప్ప వాటిపై రుణాలు ఇచ్చే రైతుబంధు పథకం అమలులో నిర్లక్ష్యం చూపుతున్నారు. బ్యాంకులు రుణాలు ఇవ్వక, కమిటీలు సహకరించక సరుకును దళారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారు. పథకం అమలు చేయడంలో కమిటీల సిబ్బందిలో చిత్తశుద్ధితో కొరవడి నిధులు మురిగిపోతున్నాయి. పన్నెండు సంవ్సత్సరాలుగా జిల్లా పరిధిలోని ఐదు మార్కెట్ కమిటీల పరిధిలో నాలుగు మార్కెట్లలో ఒక్క రైతు కూడ రైతు బంధు పథకం కింద రుణం పొందలేదంటే పరిస్థితి ఏ విధంగా కొనసాగుతుందో చెప్పకుండానే తెలిసిపోతుంది. ఒక భైంసా మార్కెట్ కమిటీ పరిధిలో నాలుగు సంవత్సరాల క్రితం 52 మంది రైతులకు రూ.48 లక్షలను రైతుబంధు పథకంలో రుణంగా అందించారు. రైతులు పండించిన వ్యవసాయోత్పత్తులు మార్కెట్ కమిటీ గోదాముల్లో నిల్వ ఉంచి సదరు సరుకు విలువపై 75 శాతం వరకు అంటే రూ. 2 లక్షల గరిష్ట పరిమితికి లోబడి రుణం పొందవచ్చు. రుణంపై 180 రోజుల వరకు ఎలాంటి వడ్డీ వసూలు చేయరు. రైతు అభ్యర్థన మేరకు 270 రోజుల వరకు సరకునిల్వ ఉంచుకోవచ్చు. దీనిపై 12 శాతం వడ్డీ వసూలు చేస్తారు. నిల్వ ఉంచిన సరకుకు భద్రతతో పాటు బీమాసౌకర్యం మార్కెట్ కమిటీ కల్పిస్తుంది. ఒకసారి పొందిన రైతుబంధు పథకం కార్డు మూడు సంవత్సరాల వరకు వినియోగించుకోవచ్చు. రైతు నుంచి నిల్వ ఉంచిన ఉత్పత్తులకు నామమాత్రమైన అద్దె, బీమా ప్రీమియం వసూలు చేస్తారు.

రైతుల దరిచేరని పథకం

రైతుబంధు పథకం దరి చేరకపోవడానికి ఉన్న కారణాలతో విస్తృత ప్రచారం లేకపోవడమే. గతంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే రైతు చైతన్యయాత్రలో మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొని కమిటీలో రైతులకు కల్పించే సౌకర్యాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేసేవారు. మూడేళ్లుగా ప్రభుత్వపరంగా రైతు చైతన్యయాత్రలు నామ మాత్రమైన నేపథ్యంలోయు కమిటీ సిబ్బంది కూడా నిమ్మకు నీరెత్తినట్లు ఉండిపోయారు. రైతుల ఉత్పత్తులను తప్పనిసరిగా మార్కెట్ కమిటీల్లో విక్రయించాలి. ఇక్కడ వ్యాపారస్తుల మధ్య పోటీ మార్కెట్ ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర వచ్చేందుకు కృషి చేయాలి. కాని జిల్లాలోని మార్కెట్ కమిటీ పాలక,అధికార వర్గాలు అనుసరిస్తున్న ఉదాసీన వైఖరి విధానాల మూలంగా దళారులదే రాజ్యం కొనసాగుతోంది. కొన్ని ప్రాంతాల్లో పంటచేనుల్లో ఏర్పాటు చేసిన కళ్లల వద్దనే దళారులు సరుకులను తూకం వేసుకొని తరలించుకపోతున్నారు. జిల్లాలో భైంసా, నిర్మల్, కుభీర్, సారంగపూర్, ఖానాపూర్‌లలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి.

పంటనిల్వపై అందని రుణాలు

ఇక్కడి ప్రాంత రైతులకు గత కొంతకాలంగా బ్యాంక్‌ల ద్వారా రుణాలు సక్రమంగా అందడం లేదు. అంతేకాకుండా గత మూడు సంవత్సరాలుగా నెలకొన్న ప్రతికూల పరిస్థితుల మూలంగా ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు సక్రమంగా పండక రైతులు కోలుకోలేని రీతిలో నష్టా లపాలయ్యారు. ఈ ఖరీఫ్‌సీజన్‌లో పంటల పెట్టుబడికి చిల్లిగవ్వ కూడా చేతిలో లేకపోవడంతో అధికశాతం రైతులు కమీషన్ ఏజెంట్లు, దళా రులు, కొనుగోలుదారులు, వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి సాగుకోసం అ ప్పులు తెచ్చుకున్నారు. ఈ క్రమంలో దిగుబడుల విక్రయాల్లో దళారులు, కమీషన్ ఏజెంట్లు, కొనుగోలుదారులు చెప్పిన ధరలకే సరుకులను అమ్ముకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ముందుగా వ్యాపారుల నుంచి రుణం తీసుకున్నందున ధర నిర్ణయంలో వారు చెప్పిందే చెల్లు బాటు అవుతోంది. ప్రతికమిటీలో అవసరాల మేరకు గోదాములు ఉన్నా రైతుబంధు పథకం అమలు చేసేందుకు సిబ్బంది ఆసక్తి చూపడం లేదు.

నామమాత్రంగా పాలకమండళ్లు

జిల్లాలో ఐదు మార్కెట్ కమిటీలుండగా అన్నింటికీ పాలక వర్గాల నియమాకం జరిగింది. అయితే పాలక మండళ్ల ప్రతినిధులు రైతులకు ప్రయోజకరంగానున్న రైతుబంధు పథకం అములులో చిత్తశుద్ధి చూపడం లేదు. రైతులకు సంబంధిత పథకం గూర్చి అవగాహన కల్పించి చైతన్యపరచడంలో పాలక మండళ్లు విఫలమవుతున్నాయి. ప్రతిమూడు నెలలకోమారు జరిగే మండల పరిషత్ సర్వ సభ్య సమావేశాల్లో పాల్గొనే ప్రజాప్రతినిధులకు సంబంధిత పథకంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి వారి ద్వారా గ్రామాల్లో రైతుబంధు పథకంపై ప్రచారం కల్పించేందుకు అవకాశమున్న ఎక్కడి కూడా ఇది జరుగడం లేదు.

నిధులున్నా నిర్లక్ష్యమే

జిల్లాలోని కమిటీల్లో పన్నులరూపంలో వసూలు చేసిన కోట్లాది రూపాయలు ఉప ఖజానాలలో నిల్వలు ఉన్నాయి. గత అర్థిక సంవత్సరములో జిల్లాలోని ఐదు మార్కెట్ కమిటీల్లో ఒక్క మార్కెట్ కమిటీ కూడా వార్షిక ఆదాయలక్ష్యాన్ని చేరుకోలేదు. అయినప్పటికీ ఆశాజనకమైన ఆదాయం మాత్రం సమకూరింది. ప్రతీ మార్కెట్ కమిటీ పరిధిలో కోట్లాది రూపాయల నిల్వలు ఉన్నప్పటికి రైతుబంధు పథకం అమలు చేయడంలో తాత్సారం చేస్తుండడంతో కమిటీలు ఏర్పాటు చేసిన ఉద్దేశం నెరవేరకుండా పోతోంది.

ప్రచారం లేకనే పథకం అమలులో జాప్యం

మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు రుసుముల లక్ష్యాన్ని సమీక్షిస్తున్నారే కాని రైతులకు ఉద్దేశించిన పథకాల అమలు గురించి చర్చించిన దాఖలాలు లేవు. కమిటీల్లో శాశ్వత సిబ్బంది కన్నా తాత్కాలికంగా పొరుగుసేవల్లో పనిచేస్తున్నవారే ఎక్కువసంఖ్యలో ఉన్నారు. దాంతో అధికారులు కూడా రుసుముల వసూళ్లకు వీరిని వినియోగిస్తున్నారే తప్ప సంక్షేమ పథకాల వైపు వెళ్లనీయడం లేదు. మార్కెట్ కమిటీల్లో రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను ప్రచారం చేయాల్సి ఉంది. ఈ విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకొని ప్రత్యేకంగా చైతన్యయాత్రలు నిర్వహించాలి. అందుకు ప్రస్తుతం ఉన్న సిబ్బందికి తోడు అదనంగా ఉద్యోగులను నియమించాలి.

# బడుల బాగుకు పంచాయతీ నిధులు..!

నిర్మల్ : జిల్లాలోని చాలా బడుల్లో పలురకాల సమస్యలు నెలకొన్నాయి. మరమ్మతులు, వసతుల కల్పనకు అవసరమైన నిధులు విద్యాశాఖ నుంచి మంజూరు కాకపోవడంతో చాలావరకు అపరిష్కృతంగా మిగిలిపోతున్నాయి. అయితే.. పంచాయతీలకు మంజూరయ్యే నిధులను ఈ సమస్యల పరిష్కారానికి సద్వినియోగం చేసుకోవచ్చని కేంద్రం తాజాగా ఉత్తర్వులు జారీచేసింది.

ఏం చేయొచ్చంటే..మౌలిక వసతుల కల్పన, మరమ్మతుల కోసం 14, 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకోవచ్చు. పాలకులు, విద్యాకమిటీలు, గ్రామస్థులంతా కలసికట్టుగా పనిచేస్తే తమ ప్రాంతంలోని బడిని బాగుచేసుకోవచ్చు. మరింత అభివృద్ధి చేసుకోవచ్చు. సురక్షిత తాగునీరు, శానిటరీ ప్యాడ్ల దహనానికి అవసరమైన యంత్రాలను సమకూర్చడం, దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక మరుగుదొడ్లు, మూత్రశాలలు, లీకేజీల్లేకుండా పైప్‌లైన్ నిర్మాణం, చేతులు కడుక్కునేందుకు ఏర్పాట్లు, వంట షెడ్లు నిర్మాణం, పెరటితోటల పెంపకం, విద్యుత్తు కనెక్షన్లు, వైఫై సౌకర్యం, తరగతి గదులు, ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలు, ఫర్నీచర్, ప్రహరీ నిర్మాణం,



మైదానం అభివృద్ధి, వర్షం నీటిని భూగర్భంలోకి పంపించడానికి ఇంకుడుగుంతల నిర్మాణం.. ఇత్యాది పనులను చేపట్టడానికి అవకాశం ఉంది. పంచాయతీ పరిధిలో అందుబాటులో ఉన్న ఆర్థికసంఘం నిధులను ఆధారంగా చేసుకొని అవసరమైన పనులు పూర్తిచేయొచ్చు.

చిత్తశుద్ధే కీలకం..తమ పరిధిలో ఉన్న బడులను బాగుచేసేందుకు అధికారులు, పాలకుల చిత్తశుద్ధే ఇప్పుడు కీలకం కానుంది. ప్రస్తుతం మంజూరవుతున్న ఆర్థికసంఘం నిధుల్లో 20 శాతం విద్యుత్తు బిల్లులు, 30 శాతం ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. మిగతా 50 శాతం నిధులను పంచాయతీల అభివృద్ధికి ఉపయోగిస్తున్నారు. వీటినుంచే పాఠశాలలకు కేటాయించుకోవచ్చు. అయితే.. వస్తున్న నిధులను ఎంతమేర కేటాయించి వినియోగిస్తారనేదే ప్రశ్నార్థకంగా మారింది. చాలా పంచాయతీల్లో ట్రాక్టర్లు, ట్రాలీలను రుణాలతో కొనుగోలు చేశారు. వీటి వాయిదాలు చెల్లించడమే కష్టంగా మారుతోందని, ఇలాంటి స్థితిలో ఉన్న కాసిన్ని నిధులను ఎలా వాడుకోవాలనే సందేహాలు తలెత్తుతున్నాయి.

ఈ చొరవ కావాలి..

దిలావర్‌పూర్ మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల భవనం ఇది. పైకప్పు శిథిలమవడంతో విద్యార్థులకు ఇబ్బందులు కల్గుతున్నాయని గుర్తించిన స్థానిక నాయకులు, గ్రామస్థులు సమస్య పరిష్కారానికి చొరవ చూపారు. పంచాయతీ నిధులతో నూతనంగా పైకప్పు నిర్మించారు. ఫలితంగా ఎండా, వాన నుంచి బడికి రక్షణ కల్గినట్లయింది. విద్యార్థులు సజావుగా పాఠాలు వినే అవకాశం ఏర్పడింది. ఇలా అన్నిచోట్లా ముందుకొస్తే సమస్యలు చాలావరకు పరిష్కారమవుతాయి.

పెచ్చులూడుతున్న స్లాబు

ఇది ముథోల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోనిది. ప్రస్తుతం ఇక్కడ 96 మంది విద్యార్థులున్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో గదిలోని స్లాబు ఇలా పెచ్చులూడుతోంది. వర్షాకాలంలో గదులన్నీ ఊరుస్తూ పరిస్థితి ఇబ్బందికరంగా మారుతోందని, చదువుకు ఆటంకం ఏర్పడుతోందని విద్యార్థులు వాపోతున్నారు.

ఉత్తర్వులు వెలువడ్డాయి– వెంకటేశ్వర్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి

పంచాయతీల్లో అందుబాటులో ఉన్న ఆర్థికసంఘం నిధులను పాఠశాలల సంక్షేమానికి ఉపయోగించుకోవచ్చని కేంద్రం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. స్థానికంగా కావాల్సిన వసతులు, అవసరమైన నిధులు, అందుబాటులో ఉన్నవాటిని బేరీజు వేసుకొని అవసరమైన చర్యలు చేపట్టాలి. ఇప్పటికే దిలావర్‌పూర్, నర్సాపూర్ (జి) పరిధిలో పంచాయతీ నిధులను బడులకు వినియోగించుకున్నారు.

# తపాలా ద్వారా నేరుగా రైతుబంధు

బాన్సువాడ : తపాలాశాఖ ద్వారా అన్నదాతలకు నేరుగా రైతుబంధు డబ్బులు చెల్లించేందుకు పోస్టల్ శాఖ నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న మొత్తాన్ని మైక్రో ఏటీఎంల ద్వారా లబ్ధిదారులకు అందించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇందుకు ఎటువంటి సేవా రుసుము తీసుకోవద్దని నిర్ణయించింది.

ఇబ్బందులు లేకుండా... రైతులకు తమ ఖాతాలో జమైన నగదును తీసుకునేందుకు బ్యాంకు వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఆ అవస్థలు



తప్పించేందుకు తపాలా ద్వారా నేరుగా అందించనున్నారు. ఇందుకు రైతుకు సంబంధించిన బ్యాంకు ఖాతాకు ఆధార్, చరవాణి నంబరు అనుసంధానం చేసుకుంటే సరిపోతుంది. ఎవరికైనా అనుసంధానం లేకున్నా దగ్గర్లోని తపాలాశాఖలో అనుసంధానం చేయనున్నారు. రోజుకు రూ.10 వేల పరిమితితో నగదు అందించనున్నారు.

మేమే వెళ్తాం... వేణు, తపాలాశాఖ, ఇన్‌స్పెక్టర్, బోధన్ సబ్‌డివిజన్ ఒక ఊర్లో ఎక్కువ మంది రైతులు ఉండి మాకు సమాచారం అందిస్తే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారి వద్దకు వెళ్లి మేమే నగదు అందజేస్తాం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. బ్యాంకు ఖాతాకు ఆధార్‌తో పాటు చరవాణి నంబరు అనుసంధానం ఉండాలి. లేకపోయినా మేమే ఆ పని చేసి డబ్బులు ఇస్తాం.

ఉమ్మడి జిల్లా వివరాలు.. ప్రధాన తపాలా కార్యాలయాలు : 03 (నిజామాబాద్, కామారెడ్డి, ఆర్మూర్)ఉప కార్యాలయాలు : 64 బ్రాంచి కార్యాలయాలు : 415 మైక్రోఏటీఎంలు : నిజామాబాద్‌లో 300 ః కామారెడ్డిలో 160

# మంత్రి రజిని, ఎంపీ అవినాష్ బంధువులకు హైకోర్టు నోటీసులు




అమరావతి: గ్రానైట్ తవ్వకాలపై హైకోర్టు స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో మంత్రి విడదల రజిని, ఎంపీ అవినాష్‌రెడ్డి బంధువులు ప్రతాప్‌రెడ్డి, శ్వేతారెడ్డి, జి.వి.దినేశ్‌రెడ్డి, శివపార్వతికి నోటీసులు పంపింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం మురికిపూడిలో 21.50 ఎకరాల స్థలంలో తమకు తెలియకుండా గ్రానైట్ తవ్వకాలకు ఎన్‌వోసీ ఇవ్వడంపై హైకోర్టులో రైతుల పిటిషన్ దాఖలు చేశారు. ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన భూముల్లో డి.కె. పట్టాలు రద్దు చేయకుండా తవ్వకాలు జరిపారని పేర్కొన్నారు.

పిటిషనర్ తరఫున న్యాయవాది వి.వి.లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయస్థానం... గ్రానైట్ తవ్వకాలపై స్టేటస్ కో విధించింది. ఎన్‌వోసీ ఇచ్చిన తహసీల్దార్‌తో సహా పలువురికి నోటీసులు పంపింది. దీనిపై తదుపరి విచారణను వచ్చేనెల 10కి వాయిదా వేసింది. అప్పటివరకూ స్టేటస్ కో ఉత్తర్వులు వర్తిస్తాయని పేర్కొంది. అదేవిధంగా దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని మంత్రి రజిని, ఇతరులను హైకోర్టు ఆదేశించింది.

# ఇటుక తయారీ కార్మికులకు లోకేష్ ఇచ్చిన హామీ ఏంటంటే...



శ్రీసత్యసాయిజిల్లా: టీడీపీ యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర 53వరోజుకు చేరుకుంది. పెనుకొండ నియోజకవర్గంలో ప్రస్తుతం లోకేష్ పాదయాత్ర కొనసాగుతోంది. 53వ రోజు గుమ్మయ్యగారిపల్లి క్యాంప్ సైట్ నుంచి పాదయాత్రను ప్రారంభించిన లోకేష్‌ను మల్లాపల్లిలో ఇటుక తయారీ కార్మికులు కలిశారు. ఈ సందర్భంగా వారి సమస్యలను యువనేత ముందు ఏకరువు పెట్టారు. మల్లాపల్లి గ్రామంలో 20 ఇటుక బట్టీలు ఉన్నాయని... వాటిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నామన్నారు. చెరువుకుంటలో ఉచితంగా మట్టి తోలుకోవడానికి తమకు అనుమతులు ఇవ్వాలని కోరారు. ఇటుకల బట్టీలకు అవసరమైన బొగ్గునిమిత్తం కట్టెలు కొట్టుకోవడానికి అనుమతి ఇవ్వాలన్నారు. ఇటుకల బట్టీల వద్ద షెడ్ల నిర్మాణానికి బ్యాంకులు, కార్పొరేషన్ల నుంచి సబ్సిడీ రుణాలు మంజూరుచేయాలని లోకేష్‌కు విన్నవించారు. యువనేత లోకేష్ స్పందిస్తూ.. నిర్మాణ రంగంలో కీలకంగా ఉన్న ఇటుకల తయారీ కార్మికులకు అవసరమైన సహాయ, సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇటుకల తయారీని కుటీర పరిశ్రమగా గుర్తించి షెడ్ల నిర్మాణానికి సబ్సిడీ రుణాలు అందిస్తామన్నారు. ఇటుకల తయారీకి అవసరమైన గ్రామీణ చెరువుల్లో మట్టి తోలుకోవడానికి, కట్టెలు కొట్టుకోవడానికి ఉచితంగా అనుమతులు ఇస్తామని లోకేష్ వెల్లడించారు.




# ఎమ్మెల్యే అనిల్‌పై ఎమ్మెల్యే మేకపాటి హాట్ కామెంట్స్...

అమరావతి : వైసీపీ ఎమ్మెల్యే అనిల్ కుమార్‌పై వైసీపీ బహిష్కృత ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. నోరు ఉంది కదా అని ఇష్టమొచ్చినట్టు మాట్లాడవద్దని అనిల్‌ను హెచ్చరించారు. పెద్దపెద్ద వాళ్లని తానూ తరిమినోడినేనని.. కేవలం అనిల్‌కు నోరుందనే మంత్రి పదవి ఇచ్చారన్నారు.

సిటీలో అనిల్ గెలుస్తాడని అనే వారే లేరని మేకపాటి ఎద్దేవా చేశారు. తాను నాలుగు సార్లు ఎమ్మెల్యేనని.. గత ఎన్నికల్లో 35 వేలు మెజార్టీ తెచ్చుకున్నానన్నారు. సింగిల్ డిజిట్‌తో గెలిచినోడివి అంటూ అనిల్‌కు చురకలు అంటించారు. రాబోయే ఎన్నికల్లో తాను గెలుస్తానని.. రామనారాయణరెడ్డి నూటికి నూరు శాతం, కోటంరెడ్డి నూటొక్క శాతం గెలుస్తారని స్పష్టం చేశారు. అనిల్‌కి అస్సలు టిక్కెట్టే ఇవ్వరంటున్నారని ముందు అది చూసుకోవాలంటూ సూచనలు చేశారు. 'నేను గెలవకపోతే రాజకీయాలు వదిలేస్తా... నువ్వు గెలవకుంటే రాజకీయాలు వదిలేస్తావా?అని మేకపాటి హెచ్చరించారు. అంతకు ముందు అనిల్.. పార్టీ నుంచి సస్పెండ్ అయిన ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు.

2024 ఎన్నికల్లో ఎవరు అసెంబ్లీకి వస్తారో తేల్చుకుందామని సవాల్ విసిరారు. తనను శాసనసభకు రానివ్వబోమంటూ కొందరు మంగమ్మ శపథాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల పసుపు కండువా కప్పుకున్న కొందరు జిల్లాలో పదికి పది స్థానాలూ సాధిస్తామని చెబుతున్నారని.. కనీసం ముగ్గురు గెలిచి చూపించాలని సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల్లో జగన్ బొమ్మతోనే తాను పోటీ చేస్తానని వీలైతే ఆపండి చూద్దామంటూ సవాల్ విసిరారు.




# రాహుల్‌కు సావర్కర్ మనవడి సవాల్

ముంబయి: వీర్ సావర్కర్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. దీనిపై తాజాగా సావర్కర్ మనవడు రంజిత్ సావర్కర్ స్పందిస్తూ.. కాంగ్రెస్ నేతపై తీవ్రంగా మండిపడ్డారు. తన తాత గురించి తప్పుగా మాట్లాడినందుకు మండిపడ్డారు. ఈ సందర్భంగా రాహుల్‌కు ఆయన ఓ సవాల్ విసిరారు. దేశ భక్తుడు.. హిందుత్వ సిద్ధాంతకర్త అయిన సావర్కర్ ఎప్పుడు బ్రిటిష్ వారికి క్షమాపణలు చెప్పారో సాక్ష్యాధారాలతో నిరూపించాలని సవాల్ చేశారు. దానికి సంబంధించిన పత్రాలను చూపించాలన్నారు. రాహుల్ వ్యాఖ్యలు పిల్లల మాటల్లా ఉన్నాయని ఎద్దేవా చేశారు. రాజకీయ ప్రచారం కోసం దేశభక్తుల పేర్లను వాడుకోవటం తప్పని దుయ్యబట్టారు. ఇది చాలా పెద్ద నేరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకుగానూ రాహుల్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. 'మోదీ' అనే ఇంటిపేరును కించపర్చారన్న కేసులో రాహుల్‌కు రెండేళ్లు జైలు శిక్ష పడటంతో ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని ఇటీవల రద్దు చేసిన విషయం తెలిసిందే. తన అనర్హత వేటుపై ఇటీవల మీడియాతో మాట్లాడిన రాహుల్.. సావర్కర్ పేరును ప్రస్తావిస్తూ కొన్ని వ్యాఖ్యలు చేశారు. 'నేను సావర్కర్‌ను కాను.. గాంధీని..! గాంధీలు క్షమాపణలు చెప్పరు'అని ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి.

# బ్రహ్మోత్సవాల్లో వేడుకగా శ్రీ కోదండరాముడి చక్రస్నానం

తిరుపతి : తిరుపతి శ్రీ కోదండరామస్వామి వారి నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో చివరిరోజు మంగళవారం కపిలతీర్థంలోని పుష్కరిణిలో చక్రస్నానం నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు. ముందుగా శ్రీ లక్ష్మణ సమేత సీతారాములవారు పల్లకిలో కపిలతీర్థానికి తీసుకురాగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయ మండపంలో స్నపనతిరుమంజనాన్ని నిర్వహించారు. అనంతరం అర్చకుల వేదమంత్రోచ్చారణ నడుమ చక్రస్నానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అక్కడినుండి స్వామివారు శ్రీ గోవిందరాజస్వామి ఉన్నత పాఠశాలలోని పీ.ఆర్ తోటకు తీసుకొచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అక్కడినుంచి బయలు దేరి తీర్థకట్ట వీధి, కోటకొమ్మల వీధి, కొత్తవీధి మీదుగా శ్రీ కోదండరామాలయానికి చేరుకుంటారని వివరించారు. రాత్రి 8-30 గంటల నుంచి 9.30 గంటల వరకు ధ్వజాహరోహణంతో శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయని టీటీడీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో మోహన్, కంకణభట్టర్ ఆనందకుమార దీక్షితులు, సూపరింటెండెంట్ రమేశ్ కుమార్,భక్తులు పాల్గొన్నారు.








నాష్‌విల్ (అమెరికా): అగ్రరాజ్యం అమెరికాలో మరోసారి కాల్పులు కలకలం సృష్టించాయి. టెన్నిస్సే రాష్ట్రంలోని నాష్‌విల్‌లోని ఓ మిషినరీ పాఠశాలలో సోమవారం జరిగిన కాల్పుల్లో ముగ్గురు పిల్లలు సహా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఆ ఘటనలో నిందితురాలు/నిందితుడు కూడా ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. అయితే, ఈ కాల్పులకు తెగబడేందుకు ఆ వ్యక్తి ముందుగానే సిద్ధమైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనకు పాల్పడిన వ్యక్తి పేరు ఆడ్రే హాలే(28) అని పోలీసులు గుర్తించారు. ఆ వ్యక్తి లింగమార్పిడి చికిత్స చేయించుకున్నట్లు తెలుస్తోంది. దాంతో పోలీసులు హాలేని 'ఆమె' అని సంబోధిస్తుండగా.. లింక్డిన్ ప్రొఫైల్ మాత్రం పురుషుడిగా సూచిస్తోంది. ఇది ఆకస్మికంగా జరిగిన షూటింగ్ కాదని పోలీసులు వెల్లడించారు. భారీస్థాయిలో కాల్పులకు ప్రణాళిక రచించినట్లు ఆ వ్యక్తి వద్ద లభించిన మెనిఫెస్టో, మ్యాప్‌ను బట్టి తెలుస్తోందన్నారు. తన ప్రణాళికలో పాఠశాల ఒకటని, ఇంకా పలు ప్రాంతాల్లో కాల్పులు జరపాలనుకున్నట్లు చెప్పారు. ఒకపక్కగా ఉన్న ప్రవేశ ద్వారం నుంచి పాఠశాలలోకి ప్రవేశించి, కాల్పులు జరుపుతూ భవనంలోకి వెళ్లినట్లు తెలిపారు. ఈ ఘటనలో తొమ్మిదేళ్లలోపు ముగ్గురు చిన్నారులు మరణించగా.. మృతుల్లో మరో ముగ్గురు 60 ఏళ్ల వయస్సు వారు. ఈ మృతుల్లో ఒకరు పాఠశాల హెడ్ అని సమాచారం. ఇక పోలీసుల కాల్పుల్లో హాలే మృతి చెందినట్లు వెల్లడించారు. ఈ ఘటన వెనక గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆ వ్యక్తికి ఎటువంటి నేర చరిత్రలేకపోవడం, ఉన్నత విద్యార్హతలుండటం గమనార్హం. ఈ హింసాకాండను అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఖండించారు. ఇలాంటి ఉదంతాలు పునరావృతం కాకుండా మరిన్ని చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు.

**కాల్పుల ప్రకటన ముందు బైడెన్ జోకులు..** కాల్పులు గురించి ప్రకటన చేయడానికి ముందు బైడెన్ మాట్లాడిన తీరు విమర్శలకు దారితీస్తోంది. వాటి గురించి మాట్లాడే ముందు ఐస్‌క్రీం గురించి ప్రస్తావించారు. 'నా పేరు జో బైడెన్. నేను జిల్ బైడెన్ భర్తను. నేను జెనీస్ ఐస్‌క్రీం, చాక్లెట్ చిప్స్ తింటాను. వీటి కోసం నేను ఇక్కడకు వచ్చాను. నేను జోక్ చేయట్లేదు.. నిజమే చెప్తున్నా' అంటూ బైడెన్ అసందర్భంగా మాట్లాడారు.

# ఏపీలో ఎన్నికలపై బోండా ఉమా సంచలన వ్యాఖ్యలు



అమరావతి: ఏపీలో ఎన్నికలపై టీడీపీ నేత బోండా ఉమామహేశ్వరరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏపీలో ముందస్తు ఎన్నికలొచ్చే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

మంగళవారం ఉదయం మాట్లాడుతూ.. ఏపీలో ఎప్పుడు ఎన్నికలొచ్చినా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జనసేనతో పొత్తు నిర్ణయం.. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు కలసి తీసుకుంటారని చెప్పారు. పది కోట్లు కాదు.. వైసీపీ ఎమ్మెల్యేలు పది వేల రూపాయల ఖరీదు కూడా చేయరని వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేలు కొనుగోలుపై వైసీపీ చెత్త ఆరోపణలను బోండా ఉమా ఖండించారు.

# వచ్చే నెలలో బ్యాంకులకు 15 రోజులు సెలవులు!

వరుస సెలవుల నేపథ్యంలో వచ్చే నెల ఏప్రిల్‌లో బ్యాంకులు దాదాపు సగం రోజులు పనిచేయడం లేదు. శని, ఆదివారాలతో కలిపి దాదాపు 15 రోజుల పాటు బ్యాంక్‌లకు సెలవులు ఉన్నాయి.

ఆర్‌బీఐ వెబ్‌సైట్ ప్రకారం.. ఏప్రిల్ 1న ఆర్థిక సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో ఖాతాల సర్దుబాటు దృష్ట్యా బ్యాంకులు సాధారణ కార్యకలాపాలు నిర్వహించవు. అలాగే 4న మహవీర్ జయంతి, 5న బాబూ జగ్జీవన్ రామ్ జయంతి, 7న గుడ్‌ఫ్రైడే, 14న అంబేద్కర్ జయంతి, 22న రంజాన్ నేపథ్యంలో తెలంగాణలో బ్యాంకులకు సెలవులు ఉన్నాయి. అయితే, ఆర్‌బీఐ వెబ్‌సైట్‌లోని వివరాల ప్రకారం.. మహవీర్ జయంతి రోజు మాత్రం ఆంధ్రప్రదేశ్‌లోని బ్యాంకులకు సెలవు లేదు. మరోవైపు రెండు, నాలుగో శనివారాలైన 8, 22వ తేదీల్లో బ్యాంకులు పనిచేయవు. అలాగే వచ్చే నెలలో మొత్తం ఐదు ఆదివారాలు ఉన్నాయి. ఇలా ఏప్రిల్‌లో తెలుగు రాష్ట్రాల్లో 11 రోజులు బ్యాంకులు పనిచేయబోవు. ఇతర రాష్ట్రాల్లో ఉండే ప్రత్యేక సెలవులను కూడా పరిగణనలోకి తీసుకుంటే దేశవ్యాప్తంగా వచ్చేనెలలో మొత్తం 15 రోజులు బ్యాంకులు పనిచేయవు.






# రాహుల్ 'అనర్హత'పై అమెరికా స్పందన ఇదే..

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై అనర్హత వేటు.. దేశ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ వ్యవహారంలో కేంద్రం తీరుపై ప్రతిపక్షాలు భగ్గుమంటున్నాయి. తాజాగా దీనిపై అగ్రరాజ్యం అమెరికా కూడా స్పందించింది. రాహుల్ గాంధీ కేసును తాము గమనిస్తున్నామని పేర్కొంది. అయితే, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేసే అంశంలో భారత్‌తో కలిసి పనిచేసేందుకు కట్టుబడి ఉన్నట్లు వెల్లడించింది. "ఏ ప్రజాస్వామ్యానికైనా.. చట్ట నిబంధనలను గౌరవించడం, న్యాయ స్వతంత్రత మూల స్తంభాలు. భారత కోర్టుల్లో రాహుల్ గాంధీ కేసును మేం గమనిస్తున్నాం. అయితే భావ ప్రకటనా స్వేచ్ఛతో పాటు ప్రజాస్వామ్య విలువలపై భారత ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు నిబద్ధతతో ఉన్నాం. మా రెండు దేశాలకు కీలక అంశాలైన ప్రజాస్వామ్య సూత్రాలు, మానవ హక్కుల పరిరక్షణ, భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రాముఖ్యతను నిత్యం హైలైట్ చేస్తూనే ఉంటాం" అని అమెరికా విదేశాంగ శాఖ డిప్యూటీ అధికార ప్రతినిధి వేదాంత్ పటేల్ ఓ మీడియా సమావేశంలో పేర్కొన్నారు.

**బోల్ట్ ఆశ్చర్యపోతాడు..: చిదంబరం సెటైర్ :** మోదీ ఇంటి పేరును కించపర్చారన్న కేసులో మార్చి 23న గుజరాత్‌లోని సూరత్ కోర్టు.. రాహుల్ గాంధీ కి రెండేళ్ల జైలు శిక్ష విధించిన విషయం తెలిసిందే. ఈ తీర్పు వెలువడిన 24 గంటల్లోపే లోక్‌సభ సెక్రటేరియేట్ ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో కేంద్రం తీరుపై విపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. తాజాగా కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం దీనిపై స్పందిస్తూ.. కేంద్రంపై వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. "రాహుల్ కేసులో తీర్పు.. ఆ వెంటనే అనర్హత పడటం అత్యంత అసాధారణం. ఈ వ్యవహారంలో కేంద్రం ప్రదర్శించిన వేగానికి ఉసెన్ బోల్ట్ కూడా ఆశ్చర్యపోతాడు" అంటూ ఆయన ఎద్దేవా చేశారు. ఓ అపవాదుకు రాహుల్ పరువునష్టం కేసును ఎదుర్కొన్నారని చిదంబరం ఈ సందర్భంగా అన్నారు. "కేవలం నింద లకు రెండేళ్ల జైలు శిక్ష పడితే.. ఇది ఎలాంటి చట్టమో అర్థం చేసుకోవ చ్చు. కావాలనే ఓ చట్టాన్ని తీసుకొచ్చి.. దాంతో ప్రతిపక్ష నేత గళాన్ని అణచివేసేందుకు ప్రయత్నించారు" అని కేంద్రాన్ని ఆయన దుయ్యబట్టారు.

# పులివెందులలో కాల్పుల కలకలం.. ఒకరి మృతి



పులివెందుల: వైఎస్సార్ జిల్లా, సీఎం జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో తుపాకీ కాల్పుల ఘటన కలకలం రేపింది. భరత్ కుమార్ యాదవ్ అనే వ్యక్తి తన తుపాకీ తీసుకొని ఇద్దరు వ్యక్తులపై నిర్దాక్షిణ్యంగా కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన దిలీప్‌ను కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మహబూబ్ బాషా పులివెందులలోని ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. భరత్ కుమార్ యాదవ్, పులివెందుల పట్టణంలోని గొర్రెల వ్యాపారి దిలీప్ మధ్య ఆర్థికలావాదేవీలు ఉన్నాయి. గత వారం రోజులుగా ఇద్దరూ డబ్బుల విషయంలో గొడవపడుతున్నట్టు సమాచారం. దిలీప్.. భరత్‌కుమార్ యాదవ్‌కు అప్పు ఉండటంతో ఆ విషయంలో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పులివెందులలోని వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఈరోజు మధ్యాహ్నం ఇద్దరూ తీవ్రస్థాయిలో ఘర్షణకు దిగడంతో.. హుటాహుటిన ఇంట్లోకి వెళ్లి భరత్‌కుమార్ యాదవ్ తనవద్ద ఉన్న తుపాకీతో కాల్పులు జరిపాడు. దిలీప్ ఛాతిపై కాల్పులు జరిపినట్టు సమాచారం. ఆ సమయంలోనే అతడి పక్కనే ఉన్న దిలీప్ స్నేహితుడు మహబూబ్ బాషా అడ్డుకొనే ప్రయత్నం చేయగా.. అతడిపైనా కాల్పులు జరిపినట్టు బాధితులు చెబుతున్నారు. గాయాలతో వీరిద్దరూ ఆలయం మెట్ల వద్ద కింద పడిపోవడంతో భరత్‌కుమార్ యాదవ్ అక్కడి నుంచి తుపాకీతో పరారయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో బాధితులను చికిత్స నిమిత్తం పులివెందుల ఏరియా ఆస్పత్రికి తరలించారు. దిలీప్ పరిస్థితి విషమంగా ఉండటంతో కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గరుడ వార్త



## హాట్ నెస్ తో హీటెక్కిస్తున్న శ్రద్ధాకపూర్..!

సాహో చిత్రంతో తెలుగు సినీ రంగంలో అడుగు పెట్టిన హాట్ బ్యూటీ శ్రద్ధా కపూర్ గురించి తెలుగు సినీ ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అవసరం లేదు. సోషల్ మీడియాను ఎక్కువగా వాడే వాళ్లకు ఈమె గురించి మరింత ఎక్కువగా తెలుసు. సినిమాల్లోనే కాకుండా సామాజిక మాధ్యమాల ద్వారా కూడా ఎప్పుడూ అభిమానులకు దగ్గరగా ఉంటుందీ బాలీవుడ్ బ్యూటీ. తనకు సంబంధించిన సినీ అప్ డేట్లతో పాటు పర్సనల్ లైఫ్ కు సంబంధించిన విషయాలను కూడా ఫ్యాన్స్ తో షేర్ చేసుకుంటూ ఉంటుంది. ఈ క్రమంలోనే తాజాగా ఆమె ఇన్ స్టా వేదికగా కొన్ని ఫొటోలను షేర్ చేసింది. బ్లాక్ డ్రెస్ లో తన లేలేత అందాలను ఆరబోసింది. జూతి కోచింగ్ క్లాసెస్.. అప్లై ఇన్ కామెంట్స్ విత్ ఎ సాంపుల్ జూత్ అంటూ క్యాప్షన్ కూడా రాసుకొచ్చింది. ఎద అందాలతో పాటు క్లీవేజ్ షో చేస్తూ.. ఒంపుసొంపులన్నీ చూపించింది. బ్లాక్ హై హీల్స్ వేస్కొని



డిఫరెంట్ స్టైల్ లో ఫొటోలకు పోజులు ఇచ్చింది. అందులో హాట్ లుక్స్ ఇస్తూ కుర్రకారుకు ఫీవర్ తెప్పిస్తోంది. ఓ వైపు చందమామలా మెరిసిపోతూనే.. అభిమానుల మతి పోగొట్టేస్తోంది. నయాగార ఫాల్స్ లా నడుమును తిప్పేస్తూ... కవ్వింతలు పెడ్తోంది. కళ్లతోనే మాయ చేస్తూ.. కుర్రకారుకు కైపెక్కిస్తోంది క్యూట్ బ్యూటీ. ఈ ఫొటోలు చూసిన అభిమానులు తమదైన స్టైల్ లో స్పందిస్తూ.. కామెంట్లు చేస్తున్నారు. అదిరిపోయావు హాట్ బ్యూటీ అని కొందరు.. హాట్ నెస్ మరింత పెరిగింది బ్యూటీ అంటూ చెబుతున్నారు. నీ నడుమందాలకి మేమెప్పుడూ బానిసలమే అని ఓ నెటిజన్ చెప్పగా.. బ్లాక్ డ్రెస్ లో చందమామలా మెరిసిపోతున్నావంటూ మరో అభిమాని కామెంట్ చేశాడు. అయితే శ్రద్ధా కపూర్ ఫొటోలు నెట్టింట షేర్ చేసిన కొన్ని గంటల్లోనే 17 లక్షలకు పైగా లైకులు వేలల్లో కామెంట్లు వచ్చాయి. కేవలం ఇన్ స్టాగ్రామ్ అకౌంట్ లోనే 77.6 మిలియన్ ఫాలోవర్లను కల్గిన శ్రద్ధా కపూర్.. కేవలం నటిగానే కాకుండా సింగర్ గా కూడా ఆమె మంచి గుర్తింపు తెచ్చురుంది. తీన్ పత్తి సినిమాలో చిన్న పాత్ర ద్వారా కెరియర్ ప్రారంభించి.. టాప్ హీరోల సరసన నటించింది. లవ్ కా ది ఎండ్ ఆషికి 2 సినిమాల్లో నటించి మెప్పించింది. ఆ తర్వాత హైదర్ ఏక్ విలన్ ఏబీసీడీ భాగీ సినిమాల్లో నటించి విమర్శకుల నుంచి ప్రశంసలు అందుకుంది.

## తడిసిన నడుము నాభి అందాల జాన్వీ

అతిలోక సుందరి శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి చాలా కాలం అయ్యింది. అయినా కూడా ఇప్పటి వరకు హీరోయిన్ గా ఒక బిగ్ కమర్షియల్ సక్సెస్ దక్కించుకోలేక పోయింది. అయినా కూడా బాలీవుడ్ హాట్ స్టార్ బ్యూటీస్ కు ఉన్నంత క్రేజ్.. ఫాలోయింగ్ ఈ అమ్మడికి ఉంది అనడంలో సందేహం లేదు. కేవలం ఫొటో షూట్స్ తోనే ఆ స్థాయి గుర్తింపును దక్కించుకుంది. హిందీలో ఇప్పటి వరకు ఒక్క హిట్ లేకున్నా కూడా ఈ అమ్మడిని భారీ పారితోషికం ఇచ్చి తెలుగు సినిమాల్లో నటింపజేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు అంటే ఇలాంటి ఫొటోలే కారణంగా చెప్పుకోవచ్చు. సాదారణంగానే అందాల ఆరబోత విషయంలో జాన్వీ



కపూర్ నోరు వెళ్లబెట్టేలా చేస్తుంది. అలాంటి జాన్వీ కపూర్ ఈసారి అంతకు మించి అన్నట్లుగా తన తడిసిన అందాల నడుము మరియు నాభిని చూపిస్తూ మతి పోగొడుతోంది. వైట్ చీర లో క్లీ వేజ్ షో చేస్తూ నడుము నాభి అందాన్ని చూపిస్తూ కవ్విస్తున్న జాన్వీ కపూర్ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. జాన్వీ కపూర్ ఇటీవలే ఎన్టీఆర్ కి జోడీగా కొరటాల శివ దర్శకత్వంలో నటించేందుకు ఓకే చెప్పిందనే వార్తలు వస్తున్నాయి. రామ్ చరణ్ కు జోడీగా కూడా ఈ అమ్మడు నటించబోతుందని వార్తలు వస్తున్నాయి. వచ్చే ఏడాది కచ్చితంగా రెండు మూడు తెలుగు సినిమాలతో అయినా జాన్వీ కపూర్ టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సందడి చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.




## క్లీవేజ్ షోతో కోహ్లీ భార్య.. స్టన్నింగ్



టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ భార్య బాలీవుడ్ బ్యూటీ అనుష్క శర్మ రోజురోజుకూ తన గ్లామర్ డోస్ ను పెంచుకుంటూ పోతోంది. క్లీవేజ్ షోతో రెచ్చిపోతూ కుర్రకారును హీటెక్కిస్తోంది. రబ్ నే బనాతే జోడీ సినిమాతో సినీ రంగంలో అడుగు పెట్టిన ఈ ముద్దుగుమ్మ.. తల్లయ్యాక మరింత అందంగా తయారైంది. తనకు సంబంధించిన ఫొటోలు సినీ అప్ డేట్లను ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకుంటూ సోషల్ మీడయాను ఓ ఊపు ఊపేస్తుంది. 62 మిలియన్ల ఫాలోవర్లను కల్గిన ఈ హాట్ బ్యూటీ.. తాజాగా కొన్ని ఫొటోలను అభిమానులతో పంచుకుంది. ఎల్లో కలర్ షాట్ టాప్ విత్ జీన్స్ వేస్కొని ట్రెండీ లుక్ లో కనిపించింది. అంతే కాదండోయ్ ఇట్ వాస్ ఆల్ విండీ బట్ ద మూడ్ వాస్ సన్నీ అంటూ క్యాప్షన్ కూడా రాసుకొచ్చి తన మనసులోని భావాలను వ్యక్తం చేసిందీ ముద్దుగుమ్మ. వాతావరణం చల్లగా ఉన్నా.. లోపల అంతా హీటెక్కిపోతోందని చెప్పింది. ప్రస్తుతం అనుష్క షేర్ చేసిన ఈ ఫొటోలతో పాటు ఆమె రాసిన క్యాప్షన్ కూడా నెట్టింట తెగ వైరల్ గా మారింది. ఈ ఫొటోల్లో అనుష్క ఎద అందాలతో పాటు క్లీవేజ్ షో చేసింది. ఎద అందాలను ఎత్తి చూపిస్తూ ఓ ఫొటోలో... చేతులు జేబులో పెట్టుకొని మరో ఫొటోకు ఫోజులిచ్చింది. బెడ్ వద్ద నిల్చొని క్యూట్ అండ్ హాట్ లుక్స్ ఇస్తూ కుర్రకారుకు గుండెల్లో హీట్ పెంచేస్తోంది. ఈమె ఫొటోలు షేర్ చేసిన కొన్ని గంటల్లోనే లక్షల్లో లైకులు వేలల్లో కామెంట్లు చేశారు అభిమానులు. నీకేం కావాలో మాకు అర్థమైందని కొందరు కామెంట్లు చేయగా.. చాలా హాట్ గా ఉన్నావంటూ మరికొంత మంది చెబుతున్నారు. ఆర్మీ ఆఫీసర్ కూతురు అయిన ఈ బాలీవుడ్ బ్యూటీ.. తన నటనకు ప్రాధాన్యం ఉన్న సినిమాల్లో మాత్రమే నటించింది. రబ్ నే బనాతే జోడీ బద్మాష్ కంపెనీ బ్యాండ్ బాజా బారాత్ పటియాల హౌస్ లేడీస్ వర్సెస్ రిక్కి భెల్ జబ్ తక్ హై జాన్ మాతృకి బిజిలీ కా మండోలా పీకేలో నటించి తన టాలెంట్ ను ప్రూవ్ చేసుకుంది. తాజాగా బాంబే వెల్వెట్ చిత్రం నటిస్తూ బిజీగా ఉంది.

## ఇంకా మహేష్ ని ఫాలో అవుతున్న బొమ్మాళీ



తన సినిమాల రిలీజ్ లకు ముందు రిలీజ్ తర్వాత విదేశీ వెకేషన్లతో రిలాక్స్ అవ్వడం మహేష్ కి అలవాటు. మహేష్ తన పిల్లలు కుటుంబంతో కలిసి సెలబ్రేషన్ మోడ్ లో ఉంటారు. ఇప్పుడు అతడి లానే విదేశీ వెకేషన్లతో సెలవులను ఎంజాయ్ చేయడాన్ని అలవాటు చేసుకుంది రష్మిక మందన. ఇటీవల ఈ బ్యూటీ తరచుగా విదేశీ వెకేషన్లకు వెళుతోంది. ముఖ్యంగా వరుస సినిమా షెడ్యూళ్లతో తీవ్రంగా అలసిపోతున్నందున రిలాక్స్ అయ్యేందుకు రిజనవేషన్ కోసం విదేశీ సముద్ర తీరాలను విలాసవంతమైన జీవన విధానాన్ని ఎంపిక చేసుకుంటోంది. రష్మిక నటించిన తాజా చిత్రం 'మిషన్ మజ్ను' విడుదలకు ముందు విశ్రాంతి తీసుకోవాలన్న తన కోరికను బహిర్గతం చేసింది. కొద్దిరోజుల పాటు విహారయాత్రకు వెళ్లాలనుకుంటోంది. ఇదే విషయాన్ని సోషల్ మీడియా పోస్ట్ లో పేర్కొంది. తనను హాలీడే బగ్ (పురుగు) కరిచిందని సెలవులను ఆస్వాధించాలనుకుంటున్నానని ఇన్ స్టా పోస్ట్ లో తెలిపింది. అంతేకాదు.. ఇటీవలి హాలిడే ట్రిప్ నుండి ఒక ఫోటోని కూడా రష్మిక షేర్ చేసింది. ఈ ఫోటోలో కుర్తా -ప్రింటెడ్ పలాజో ధరించి సుందరమైన లొకేషన్ ని ఆస్వాధిస్తూ రిలాక్స్ డ్ గా కనిపిస్తోంది. బ్లాక్ సన్ గ్లాసెస్ తో స్టైలిష్ గా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. ఇంతలోనే 'మిషన్ మజ్ను' గురించి రష్మిక సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ ఇందులో తన పాత్ర నస్రీన్ గురించి అద్భుతంగా వర్ణించింది. "షరతులు లేని ప్రేమ.. అమాయకత్వం .. వామ్ నెస్ ని ప్రదర్శించే పాత్ర ఇది. తన ప్రియమైన వ్యక్తికి ఎల్లప్పుడూ బేషరతుగా మద్దతు ఇస్తుంది. ఆమె నొప్పిని నిస్సహాయతను బాధలను నిశ్శబ్దంగా భరించి..తన ప్రేమను దక్కించుకోగలుగుతుంది. ఎవరు ఏం చేసినా- ఆమె అత్యంత ఇష్టపడే వ్యక్తిలో చిరునవ్వును తీసుకురావడానికి ప్రయత్నిస్తుంది. తాను పరిపూర్ణంగా కాదని తనకు తెలుసు.. కానీ ఆమె చేయగలిగిన ప్రతిదానిలో ఆనందాన్ని ఓదార్పును పొందుతుంది.." అంటూ తన పాత్ర గురించి వర్ణించింది. ఈ చిత్రంలో సిద్ధార్థ్ మల్హోత్రా యుద్ధ వీరుడిగా నటించాడు.

అతడి ప్రేయసిగా రష్మిక నటించింది. ఇండియా- పాకిస్తాన్ వార్ నేపథ్యంలో నిజజీవిత ఘటనల ఆధారంగా రూపొందిన చిత్రం మిషన్ మజ్ను. షేర్షా తరహాలోనే దేశభక్తి జానర్ లో తెరకెక్కింది. ఈ సినిమాలో రష్మిక పాత్ర అభిమానులను సర్ ప్రైజ్ చేయనుందని... ఈ మూవీలో సిద్ధార్థ్ మల్హోత్రాతో రొమాంటిక్ యాంగిల్ చాలా ప్రత్యేకంగా ఉంటుందని టాక్ వినిపించింది. మిషన్ మజ్ను ఈనెల 20 నుంచి నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ అవుతోంది.

## శకుంతలలా అరియానా గ్లోరీ... బర్త్ డే ట్రీట్..

బిగ్బాస్ సీజన్-4తో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది ప్రముఖ సోషల్ మీడియా యాంకర్ అరియానా గ్లోరీ. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్గానే ఉండే ఈ భామ.. అందాల ఆరబోతలో కూడా ఎప్పుడూ ముందే ఉంటుంది. క్రేజీ పోస్టులు పెడుతూ.. నెటిజన్లను తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తూ ఉంటుంది. అయితే ఆర్జీవీతో చేసిన ఇంటర్వ్యూతో ఒక్కసారిగా ఫుల్ పాపులారిటీ సంపాదించుకున్న ఈ భామ.. ఆ తర్వాత హాట్ బ్యూటీగా యూత్లో మరింత క్రేజ్ తెచ్చుకుంది. ఇక అప్పటి నుంచి గ్లామర్ షోలో ఏ మాత్రం తగ్గడం లేదు. హద్దుల్ని చెరిపేస్తూ మరీ అందాలను ఆరబోస్తోంది. ఇందుకోసం అదిరిపోయే అవుట్ ఫిట్లలో మతులు పోయేలా ఫొటోషూట్లు చేస్తుంది. ఆ ఫొటోలను నెట్టింట పోస్టూ కుర్రాళ్ల గుండెల్లో మంట పుట్టిస్తోంది. అయితే నేడు ఈ ముదుగుమ్మ



పుట్టినరోజు. దీంతో తాజాగా తన ఇన్స్టాలో ఈ విషయాన్ని తెలియజేస్తూ కొత్త ఫొటోస్ను పోస్ట్ చేసింది. 'నన్ను నేను ఎంతగా ఇష్టపడతానో అది నా ఫ్యాషన్ ద్వారానే తెలుస్తుంది.. ఈ రోజు నా పుట్టినరోజు' అని వ్యాఖ్య రాసుకొచ్చింది. ఇందులో ఆమె తెల్లటి దుస్తులతో.. శాకుంతలలా మారి.. అందలను ఆరబోస్తూ కనిపించింది. తెల్లటి వస్త్రాల్లో ఈ ముద్దుగుమ్మ పరువాలను ప్రదర్శిస్తూ.. ఊపిరాడకుండా చేసింది. అటు బొడ్డు అందాలు.. ఇటు ఎద అందాలను వలకబోస్తూ... పక్కనే ఓ తెల్లటి కుండతో కూర్చొని ఉంది. ఈ అందాల ధాటికి కుర్రాళ్లు ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. ఇక ఆ నడుము అందాలను చూసి మతి పోగొట్టుకుంటున్నారు. ఈ పిక్స్ వైరల్ చేస్తూ... యంగ్ బ్యూటీని ఎంకరేజ్ చేస్తున్నారు. ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇక ఈ భామ వ్యక్తిగత విషయానికొస్తే.. జనవరి 25 1993లో పుట్టింది. బిగ్ బాస్ తెలుగు షో తో ఫేమ్ సంపాదించుకున్న ఈమె ఆ తర్వాత బ్యాక్ టు బ్యాక్ యాంకర్గా అవకాశాలను అందుకుంటుంది. ప్రస్తుతం బీబీ జోడీతో ఆకట్టుకుంటోంది ఈ భామ. అలానే హాట్ ఫొటోలను షేర్ చేస్తూ.. తన అందాలను ఆరబోస్తూ.. ఫోటోలను షేర్ చేస్తూ.. అటు నెటిజన్స్ కు... ఇటు బుల్లితెర ఆడియెన్స్కు మరింత దగ్గరవుతూ అలరిస్తోంది.

## ఎత్తు అందాలతో మతి పోగొడుతున్న లేడీ గూఢచారి

మన తెనాలి ముద్దుగుమ్మ శోభిత ధూళిపాళ్ల బాలీవుడ్ ముద్దుగుమ్మలకు ఏమాత్రం తగ్గకుండా అందాల ఆరబోత చేస్తోంది. హీరోయిన్ గా మొదట హిందీలో సత్తా చాటి ఆ తర్వాత తెలుగు లో సినిమాలను చేస్తోంది. తెలుగు లో గూఢచారి సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన శోభిత వరుసగా సినిమాలు చేస్తూ దూసుకు పోతుంది. కేవలం హీరోయిన్ గా మాత్రమే కాకుండా తనకు వచ్చిన ప్రతి ఒక్క పాత్రకు న్యాయం చేస్తూ నటిగా తనను తాను నిరూపించుకుంటూ ఉంది. తాజాగా మేజర్ మరియు పొన్నియిన్ సెల్వన్ సినిమాలతో అలరించిన శోభిత ఈ ఏడాది మరో మూడు నాలుగు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు



కనిపిస్తున్నాయి. నటిగా ఇంత బిజీగా ఉన్న శోభిత ధూళిపాళ్ల రెగ్యులర్ గా అందాల ఆరబోత చేస్తూ సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంటుంది. మ్యాగజైన్ కవర్ ఫొటో లకు ఫోజ్ లు ఇచ్చే శోభిత తాజాగా షేర్ చేసిన ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి.

శోభిత ధూళిపాళ్ల యొక్క అందాల విందు కు ప్రతి ఒక్కరు కూడా అవాక్కవుతున్నారు. శోభిత ధూళిపాళ్ల సైడ్ యాంగిల్ లో ఎద ఎత్తు అందాలను చూపిస్తూ కవ్విస్తోంది బాబోయ్ అంటూ నెటిజన్స్ కొంటెగా కామెంట్స్ చేస్తూ ఈ అమ్మడి యొక్క అభిమానులుగా మారిపోతున్నారు. ఈ స్థాయి అందాల ప్రదర్శణ చేస్తే కుర్రకారు ఏమై పోవాలి అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.




# ఏఈ ప్రశ్నపత్రం ఎంతమందికి విక్రయించారు?..

హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం మూడో రోజు విచారణ కొనసాగుతోంది. కస్టడీలో ఉన్న నలుగురు నిందితులు ప్రవీణ్, రాజశేఖర్, డాక్యానాయక్, రాజేశ్వర్‌ను సిట్ అధికారులు విచారిస్తున్నారు. ఈరోజుతో కోర్టు ఇచ్చిన కస్టడీ గడువు ముగియనున్న నేపథ్యంలో సిట్ అధికారులు వీలైనంత కీలక వివరాలను రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. టీఎస్‌పీఎస్సీలో ఏఎస్‌వోగా పనిచేసిన ప్రవీణ్ నుంచి రేణుక ఏఈ ప్రశ్నపత్రం కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు ప్రవీణ్‌కు రూ.10లక్షలకు పైగా చెల్లించినట్లు, ఇద్దరికి మాత్రమే పేపర్ విక్రయిస్తానని ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఆ తర్వాత రేణుక నుంచి ఆమె భర్త డాక్యానాయక్ చాలా మందికి ప్రశ్నపత్రం విక్రయించినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. అయితే, రేణుకకు తెలియకుండానే పేపర్ విక్రయాలు జరిగినట్లు సిట్ అధికారులు గుర్తించారు. మధ్యవర్తుల ద్వారా టీఎస్‌పీఎస్సీలో పనిచేసే మరికొంత మంది సిబ్బందికి కూడా పేపర్ విక్రయించినట్లు తేలింది. డాక్యానాయక్ ఇచ్చిన సమాచారం మేరకు ఇప్పటికే ఈ కేసులో ప్రశాంత్, రాజేందర్, తిరుపతిని సిట్ అధికారులు అరెస్టు చేశారు.

**ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వారే లక్ష్యంగా..** డాక్యానాయక్ చాలా మందితో ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో అసలు ఏఈ ప్రశ్నపత్రం ఎంతమందికి విక్రయించారనే దానిపై సిట్ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురికి విక్రయించినట్లు సమాచారం. మరోవైపు గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీపైనా సిట్ అధికారులు దృష్టి సారించారు. ఈమేరకు ప్రవీణ్, రాజశేఖర్‌ను ప్రశ్నిస్తున్నారు. టీఎస్‌పీఎస్సీలో పనిచేసే సురేశ్, రమేశ్, షమీమ్‌కు వీరిద్దరూ ప్రశ్నపత్రం విక్రయించినట్లు గుర్తించారు. షమీమ్ మాత్రం గ్రూప్-1 ప్రిలిమ్స్, ఏఈ ప్రశ్నపత్రానికి ఎలాంటి డబ్బులు తీసుకోలేదని తెలిపారు. రమేశ్, సురేశ్‌కు స్నేహం ఉన్న కారణంగా ఉచితంగానే ఇచ్చినట్లు భావిస్తున్నారు. ఇప్పటివరకు నగదు లావాదేవీలు సంబంధించి ఎటువంటి సమాచారం బయటపడలేదు.

# హైదరాబాద్ రూపురేఖలు మారిపోయాయి..

## అత్యాధునిక వసతులతో చెరువుల అభివృద్ధి : మంత్రి కేటీఆర్



హైదరాబాద్ : జీహెచ్ఎంసీ పరిధిలోని చెరువులన్నింటినీ అన్ని రకాల అత్యాధునిక వసతులతో చెరువులను అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. హైదరాబాద్ లోని చెరువులను అభివృద్ధి చేస్తున్నాం. కుటుంబ సమేతంగా సేద తీరడానికి అనువుగా చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించామని కేటీఆర్ తెలిపారు. సీఎస్ఆర్ ( కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ) నిధులతో జీహెచ్ఎంసీ పరిధిలోని 25, హెచ్ఎండీఏ పరిధిలోని 25 చెరువుల అభివృద్ధికి చేయూతనిచ్చేందుకు సిద్ధమయ్యాయి. ఈ క్రమంలో మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న వివిధ నిర్మాణ రంగ సంస్థల ప్రతినిధులకు ఒప్పంద పత్రాలను కేటీఆర్ అందించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరానికి 440 పైచిలుకు సంవత్సరాల చరిత్ర ఉంది. హైదరాబాద్‌లో 1908లో మూసీ నదికి వరదలు వచ్చినప్పుడు.. నాటి నిజాం మోక్షగుండం విశ్వేశ్వరయ్యను పిలిచి మాట్లాడారు. ఈ నగరం బాగుండాలంటే.. భవిష్యత్‌లో వరదల ముప్పు రాకుండా సమన్వయం చేయాలని ఇంజినీరింగ్ ప్రణాళిక ఇవ్వాలని విశ్వేశ్వరయ్యను కోరారు. ఆ క్రమంలో వచ్చిందే హిమాయాత్ సాగర్, ఉస్మాన్ సాగర్. 1920లో గండిపేట్ పూర్తయింది. 94 శాతం నీళు గ్రావిటీ ద్వారా మూసీలో కలుస్తున్నాయని తెలిపారు. జులై నాటికి హైదరాబాద్‌లో వంద శాతం మురుగు నీరు శుద్ధి చేస్తాం. దేశంలోనే వంద శాతం మురుగునీటి శుద్ధి చేసే నగరంగా హైదరాబాద్ నిలుస్తుంది అని కేటీఆర్ పేర్కొన్నారు.

**దుర్గం చెరువుకు టూరిస్టుల తాకిడి..** హైదరాబాద్ రూపురేఖలు మారిపోయాయని కేటీఆర్ గుర్తు చేశారు. జీహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ పరిధిలో 155 చెరువులు ఉన్నాయి. దుర్గం చెరువు అభివృద్ధి చెందిన తర్వాత టూరిస్టులు అధికంగా వస్తున్నారు. సినిమా షూటింగ్‌లు కూడా చాలా అయ్యాయి. ఇటీవల హైదరాబాద్ సందర్శించిన ప్రముఖులు విదేశాల్లో ఉన్నామా అని ఆశ్చర్యపోతున్నారు. ఇది మన నగరం.. ఎంత గొప్పగా అభివృద్ధి చేసుకుంటే అంత బాగుంటుంది. మన పిల్లల భవిష్యత్ కోసం పెట్టుబడిగా భావించాలి. హైదరాబాద్‌లోని చాలా చెరువుల్లో ప్రైవేటు పట్టాలు ఉన్నాయి. చెరువుల్లో ఉన్న ప్రైవేటు భూముల యజమానులకు మరో చోట భూమి ఇస్తున్నాం. టీడీఆర్ కింద 200 శాతం విలువ కల్పిస్తున్నాం. 2000 సంవత్సరం నుంచి 5 దశల్లో చెరువుల శాటిలైట్ మ్యాప్స్ తీశాం. చెరువుల అభివృద్ధిలో రియల్టర్లను భాగస్వాములను చేస్తున్నాం. పక్కా ప్లాన్ రూపొందించి అమలు చేయాలని కేటీఆర్ సూచించారు.

ఆఫీస్ స్పేస్ ఆక్యుపేషన్‌లో హైదరాబాద్ నెంబర్ వన్..

ఆఫీస్ స్పేస్ ఆక్యుపేషన్‌లో దేశంలోనే హైదరాబాద్ నెంబర్ వన్‌గా నిలిచిందని కేటీఆర్ గుర్తు చేశారు. ఎంతో కృషి చేస్తే తప్ప ఇంత అభివృద్ధి జరగదు. ప్రపంచానికే వ్యాక్సిన్ క్యాపిటల్‌గా హైదరాబాద్ మారింది. ఫార్మా సిటీ ప్రారంభమైతే ప్రపంచ ఫార్మా నగరంగా మారుతుంది. శాంతిభద్రతలు, పరిపాలన బాగుండటం వల్లే భారీగా పెట్టుబడులు వచ్చాయి. 2030 కల్లా 250 బిలియన్ డాలర్ల స్థాయికి హైదరాబాద్ ఫార్మా ఇండస్ట్రీ. హైదరాబాద్‌లో వరల్డ్ క్లాస్ ఫిల్మ్ సిటీని రాచకొండలో నిర్మిస్తాం. ఒలింపిక్స్ స్థాయి స్పోర్ట్స్ సిటీ కూడా నిర్మిస్తాం. హైదరాబాద్‌లో మరిన్ని ఐకానిక్ భవనాలు రావాలన్నారు కేటీఆర్.

**మూడేండ్లలో శంషాబాద్ మెట్రో లైన్ పూర్తి చేస్తాం.. :** రెండు, మూడేండ్లలో శంషాబాద్ మెట్రో లైన్ పూర్తి చేస్తాం అని కేటీఆర్ ప్రకటించారు. లక్డీకాపూల్ – బీహెచ్ఈఎల్, నాగోల్ – ఎల్బీనగర్ రూట్లలో మెట్రోకు కేంద్రం సాయం కోరాం. ఆ రెండు రూట్లలో ఫీజబులిటీ లేదని కేంద్రం లేఖ రాయడం దుర్మార్గం. మనం కట్టే పన్నుల్లో కూడా మనకు కేంద్రం మొండి చేయి చూపిస్తోంది. యూపీ లాంటి రాష్ట్రాలకు మెట్రోలు ఇస్తున్నారు. ప్రజా రవాణాకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. హైదరాబాద్‌లో మెట్రో లైన్ 250 కిలోమీటర్లకు విస్తరిస్తాం. ఇప్పటి వరకు చూసిన అభివృద్ధి గోరంత.. చేయాల్సింది చాలా ఉంది అని కేటీఆర్ పేర్కొన్నారు.

# పెరుగుతున్న ధరలతో సామాన్యులు సతమతం : మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నిర్మల్ : కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్ పెంచుతున్న నిత్యవసర ధరల వల్ల సామాన్యులు సతమతమవుతున్నారని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పేర్కొన్నారు. నిర్మల్ నియోజక వర్గంలోని మామడ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి గంగాధర్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు, సామాన్య ప్రజల ఆదాయాన్ని పెంచేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుంటే, ప్రధాని మోదీ ధరలను పెంచుతూ సామాన్యులపై మోయలేని భారాన్ని మోపుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి ఇంటికీ గ్యాస్ కనెక్షన్లు అందజేసి కట్టెల పొయ్యి నుంచి విముక్తి కలిగిస్తే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డగోలుగా గ్యాస్ సిలిండర్ ధరలు పెంచుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలతో వాహనదారులు అల్లాడిపోతున్నారని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. ప్రజల గురించి ఎంతో గొప్పగా ఆలోచించే వ్యక్తి కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండటం అందరి అదృష్టమన్నారు. కార్యకర్తలందరూ సమిష్టిగా కృషి చేసి మరోసారి పార్టీకి అఖండ విజయం అందించాలని కోరారు.



# ఫ్లైఓవర్ కింద బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్ కోర్టు.. ఐడియా అదిరిందన్న మంత్రి కేటీఆర్!

సాధారణంగా పైవంతెనల కింత మొక్కలు పెంచడం, వాహనాల పార్కింగ్ సదుపాయాలు కల్పించడం మనం చూస్తుంటాం. అయితే నవీ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కాస్త భిన్నంగా ఆలోచించారు. ఫ్లైఓవర్ కింద ఖాళీ స్థలంలో బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటు చేశారు. దీనిపై నగర ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. దీనికి సంబంధించిన వీడియోను ఓ నెటిజన్ ట్విటర్‌లో పోస్ట్ చేశారు. ఈ ఆలోచన బాగుందంటూ మంత్రి కేటీఆర్ సైతం ఆ వీడియోను షేర్ చేశారు. హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి ఏర్పాటు చేద్దామంటూ పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్విండ్‌కుమార్‌ను ట్యాగ్ చేశారు.



# మాతాశిశు మరణాలను తగ్గించేందుకే ఎంసీహెచ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్: మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్ : రాష్ట్రంలో మాతా శిశు మరణాలు తగ్గుముఖం పట్టి దేశంలోనే మూడో స్థానంలో ఉన్నామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. నిమ్స్ కు అనుబంధంగా.. ఎర్రమంజిల్‌లో నిర్మించే 200 పడకల మాతా, శిశు సంరక్షణ కేంద్రం నిర్మాణానికి మంత్రి హరీశ్‌రావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎంసీహెచ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను మొదటిసారిగా రాష్ట్రంలో తొలిసారిగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసుకుంటున్నామని తెలిపారు. గతంలో రాష్ట్రంలో మూడు ఎంసీహెచ్ ఆస్పత్రులు మాత్రమే ఉండే. ఆ సంఖ్యను 27కు పెంచుకున్నాం. తద్వారా గొప్ప ఫలితాలు వచ్చాయి. ఎంసీహెచ్ ఆస్పత్రుల నిర్మాణానికి రూ. 499 కోట్లను ఖర్చు చేసినట్లు తెలిపారు. ఎంసీహెచ్ ఆస్పత్రులను 27కు పెంచడంతో మాతా శిశు మరణాలు తగ్గాయి. తెలంగాణ ఏర్పడక ముందు మాతా మరణాలు ప్రతి లక్షకు 92 మరణాలు ఉండే.. దాన్ని 43కు తగ్గించగలిగాం. ప్రతి లక్షకు శిశు మరణాలు 36 ఉంటే 21కి తగ్గించుకున్నాం అని తెలిపారు. మాతాశిశు మరణాలు తగ్గుముఖం పట్టి దేశంలో మూడో స్థానంలో ఉన్నాం. మొదటి స్థానానికి వెళ్లాల్సిన అవసరం ఉంది. అందుకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల అవసరం ఉందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. గాంధీలో 200 పడకల సూపర్ స్పెషాలిటీ, నిమ్స్‌లో 200 పడకలు, అల్వాల్‌లో కూడా 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఎంసీహెచ్ ఆస్పత్రులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నిమ్స్‌కు అనుబంధంగా నిర్మిస్తున్న ఎంసీహెచ్ ఆస్పత్రిని రూ. 55 కోట్లతో 4 అంతస్తుల్లో 200 పడకలతో నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించేందుకు ప్రభుత్వ కృషి చేస్తుంది. ప్రభుత్వ రంగంలో కానీ, ప్రయివేటు రంగంలో కానీ 100 పడకల దయాలసిస్ యూనిట్ ఎక్కడా లేదు. నిమ్స్‌లో కేవలం 34 దయాలసిస్ బెడ్లు మాత్రమే ఉన్నాయి.. వాటిని 100కు పెంచుకుంటున్నాం. దీంతో దాదాపు 1500 మంది రోగులు దయాలసిస్ సేవలు పొందుతారు.

వీరందరికి ఆరోగ్యశ్రీ కింద వైద్యం అందిస్తున్నాం. దయాలసిస్ రోగులను కాపాడుకునేందుకు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ చేస్తున్నాం. ఆసరా పెన్షన్లు, ఉచిత బస్ పాస్‌లను కూడా అందిస్తున్నాం. ఇవాళ నిమ్స్‌లో రూ. 9 కోట్లతో కొత్త ఎంఆర్ఐ మెషీన్‌ను ప్రారంభిస్తున్నాం. 34 మంది కొత్త అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఇవాళ ఉద్యోగ నియామక పత్రాలు అందిస్తున్నాం. రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులను పెంచుతున్నామని మంత్రి హరీశ్‌రావు తెలిపారు.

# మా నాన్నకు ఆరోగ్యం బాగోలేనప్పుడు సోనియా ఫోన్ కూడా చేయలేదు



పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్(డీఎస్) తిరిగి కాంగ్రెస్‌లో చేరిన అంశం వివాదానికి దారితీసింది. ఆయన కుటుంబంలో చిచ్చు రేపిన విషయం తెలిసిందే. దీనిపై శ్రీనివస్ తనయుడు, బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ.. "మా నాన్న మొదటి నుంచి కాంగ్రెస్ వాది. ఆయనకు ఆరోగ్యం బాగోలేనపుడు సోనియా గాంధీ కనీసం ఫోన్ చేయలేదు. మా నాన్న కాంగ్రెస్ పార్టీలో చేరుతా అంటే కనీసం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మా ఇంటికి వచ్చి పార్టీలో ఆయనను జాయిన్ చేసుకోవాలి" అని పేర్కొన్నారు.

**అసలేం జరిగిందంటే..** పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస(డీఎస్) తిరిగి కాంగ్రెసలో చేరిన అంశం వివాదానికి దారితీసింది. ఆయన కుటుంబంలో చిచ్చు రేపింది. డీఎస్ కుమారులిద్దరి మధ్య ఉన్న విభేదాలు రచ్చకెక్కేలా చేసింది. ఈ నెల 26న డి.శ్రీనివాస్ తన పెద్ద కుమారుడు ధర్మపురి సంజయ్‌తో కలిసి గాంధీభవన్‌లో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఇతర సీనియర్ నేతల సమక్షంలో ఆ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. కొంతకాలంగా అనారోగ్యంతో ఉంటూ, ఇటీవలే ఆస్పత్రిలో చికిత్స కూడా పొందిన డీఎస్.. వీల్‌చైర్‌లోనే గాంధీభవన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు డీఎస్ కుమారుడు సంజయ్‌తోపాటు ఆయన మెడలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దీనిపై సోమవారం ఆయన కుటుంబంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. కాంగ్రెసలో చేరి ఒక్కరోజు కూడా గడవక ముందే.. పార్టీకి తాను రాజీనామా చేస్తున్నట్లు డీఎస్ లేఖను విడుదల చేశారు. దీనిని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు పంపించారు. తన వయసు, అనారోగ్యం కారణంగా క్రియాశీల రాజకీయాల్లో ఉండలేనని పేర్కొన్నారు. తన కుమారుడు సంజయ్‌ని ఆశీర్వదించేందుకు గాంధీభవన్‌కు వెళితే తనకు కూడా కండువా కప్పి పార్టీలో చేరినట్లు ప్రచారం చేశారని తెలిపారు. డీఎస్ సతీమణి విజయలక్ష్మి కూడా ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించింది. దీనిపై డీఎస్ పెద్ద కుమారుడు డి.సంజయ్ తీవ్రంగా స్పందించారు. ఇదంతా తన తమ్ముడు, బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ వల్లే జరుగుతోందని ఆరోపించారు. లేఖలు కల్పితమని, తన తండ్రిని బంధించి సంతకం చేయించారని అన్నారు. కాంగ్రెస్ వర్గాలు కూడా అర్వింద్ ఒత్తిడి మేరకే ఈ నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయని ఆరోపించాయి. అయితే బాత్రూంకు కూడా వెళ్లలేని తన తండ్రిని గాంధీభవన్‌కు తీసుకెళ్లి కండువా కప్పారని అర్వింద్ ఆరోపించారు.

# మహిళా రిజర్వేషన్ల బిల్లుపై చర్చకు బీఆర్ఎస్ ఎంపీల వాయిదా తీర్మానం




మహిళా రిజర్వేషన్ల బిల్లు కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటం ఉధృతం చేసింది. ఈ బిల్లుపై చర్చను కోరుతూ లోక్‌సభలో వాయిదా తీర్మానం ప్రవేశపెట్టింది. అఖిలపక్ష సమావేశం నిర్వహించి మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చించాలని ఎంపీలు నామా నాగేశ్వరరావు, మాలోతు కవిత ఈ తీర్మానాలు ప్రవేశపెట్టారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం దేశంలోని యూనివరసిటీలు, కాలేజీల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు, చర్చలు నిర్వహించేందుకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ఈ క్రమంలోనే మహిళా బిల్లుకు మద్దతు కోసం దేశంలోని ప్రముఖ విద్యావేత్తలు, ప్రొఫెసర్లు, ఆలోచనపరులు, మేధావులకు ఎమ్మెల్సీ కవిత పోస్టు కార్డులు పంపించారు.

# ఎమ్మెల్సీ కవితకు ఈడీ జాయింట్ డైరెక్టర్ లేఖ..




దిల్లీ : దిల్లీ మద్యం కుంభకోణం కేసులో భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఈడీ జాయింట్ డైరక్టర్ లేఖ రాశారు. విచారణలో భాగంగా కవిత అందించిన మొబైల్ ఫోన్లను తెరిచేందుకు సిద్ధమయ్యామని లేఖలో పేర్కొన్నారు. ఫోన్లు ఓపెన్ చేసేటప్పుడు స్వయంగా హాజరుకావడం లేదా తన ప్రతినిధిని పంపాల్సిందిగా లేఖలో ఈడీ తెలిపింది. దీంతో కవిత తరపున ఈడీ ముందుకు భారాస లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ వెళ్లనున్నారు.

# పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌లో క్వాలిటీ కంట్రోల్ మరింత పటిష్టం




తెలంగాణ పోలీస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగే పోలీస్ కార్యాలయాల భవనాల నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టేందుకు ప్రత్యేకంగా క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని పటిష్టం చేయనున్నట్లు కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ పేర్కొన్నారు. చైర్మన్ అధ్యక్షతన తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ సమావేశం జరిగింది. సమావేశంలో డీజీపీ అంజనీకుమార్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, కార్పొరేషన్ ఎండీ రాజీవ్ రతన్, అడిషనల్ డీజీ సంజయ్‌కుమార్ జైన్, ఫైర్ సర్వీస్ డీజీ నాగిరెడ్డి, డీఐజీ రమేశ్‌రెడ్డి, కార్పొరేషన్ సీఈవో విజయ్‌కుమార్, రక్షిత మూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టే నిర్మాణ పనుల్లో మరింత నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ప్రస్తుతం ఉన్న క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని పటిష్టం చేయాలని, ఈ విభాగంలో నిపుణులైన అధికారులను తీసుకోవాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఉన్న అకౌంట్స్ విభాగాన్ని మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు ఫైనాన్స్, అకౌంట్స్ విభాగానికి ప్రత్యేకంగా సీనియర్ అధికారిని డిప్యుటేషన్ పద్ధతిపై నియమించాలని సమావేశం నిర్ణయించింది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : VISHWANATH V, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com